

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఘనస్వాగతం

- తూర్పు నౌకాదళంలో కార్యక్రమానికి హాజరు



గీతాలతో అలరించిన బాలికలకు బహుమతి అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌కు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శనివారం సాయంత్రం 4.40 గంటలకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో ఇక్కడకు చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జనసేన పార్టీ ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, పలువురు పార్టీ నేతలు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన తూర్పు నౌకాదళ కేంద్రానికి వెళ్లారు. 'సముద్రిక' ఆడిటోరియంలో నిర్వహించిన ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా 'సర్గం-2025' కార్యక్రమానికి హాజరయ్యారు. పవన్‌కల్యాణ్‌తో వెంట ఆయన కుమారుడు అకిరా నందన్ ఉన్నారు.

ఎక్కడి పనులు అక్కడే

- గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కింద పనులు
- కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో అందని బిల్లులు
- పలుచోట్ల అర్ధంతరంగా ఆగిన పనులు
- కూటమి అధికారంలో వచ్చి ఏడాదిన్నర దాటినా మోక్షం లేని వైనం
- వసతి కొరతతో విద్యార్థుల ఇక్కట్లు

అసంపూర్తిగా పాఠశాలల అదనపు భవనాలు



అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్తికాని అదనపు తరగతి గదుల భవన నిర్మాణం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా పాఠశాలల్లో నిర్మాణం చేపట్టిన అదనపు భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో మౌలికవసతుల కల్పన పేరుతో నాడు-నేడు పథకాన్ని అమలు చేసిన వైసీపీ పాలకులు.. ఆయా పనులు చేపట్టిన పాఠశాలల కమిటీలకు, కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేదు. దీంతో అర్ధంతరంగా పనులు ఆపేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 'మన బడి-మన భవిష్యత్తు' పథకం కింద అసంపూర్తిగా వున్న భవన నిర్మాణాలను పూర్తిచేయాలని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అడుగు ముందుకు పడడంలేదు.

గత వైసీపీ ప్రభుత్వం 'మన బడి నాడు-నేడు' కార్యక్రమం కింద జిల్లాలో గత 2023-24 సంవత్సరంలో రూ.254 కోట్ల అంచనా వ్యయంతో వివిధ పాఠశాలల్లో 604 నిర్మాణ పనులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా అదనపు తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్లు, నీటివసతి కల్పన, విద్యుత్ సదుపాయం వంటి పనులు చేపట్టాలి. కొన్నిచోట్ల పాఠశాల విద్యా కమిటీలు నిర్మాణ పనులు చేపట్టగా, మరికొన్నిచోట్ల కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. అయితే మొదటి దశ పనులు పూర్తి చేసిన తరువాత బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగా.. నిధులు విడుదలలో తీవ్ర జాప్యం జరిగింది. దీంతో ఆయా కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. గత ఏడాది మార్చి చివరినాటికి మొత్తం రూ.131 కోట్ల విలువైన నిర్మాణాలు జరగ్గా.. ఇందులో రూ.18 కోట్ల మేర బిల్లులు అందలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 'మన బడి-మన భవిష్యత్తు' పథకం కింద పాఠశాలల్లో అసంపూర్తిగా వున్న భవన నిర్మాణాలు, ఇతర పనులు పూర్తి చేయాలని భావించింది. పాత బిల్లులతోపాటు అసంపూర్తిగా వున్న భవనాల పనులు పూర్తిచేయాలంటే రూ.20 కోట్లు అవసరమని సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. కానీ ఇంతవరకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. వాస్తవంగా పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు, ప్రధానోపాధ్యాయుల ఉమ్మడి బ్యాంకు ఖాతాల్లో కొంత నగదు ఉన్నప్పటికీ.. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోవడం, పాఠశాలల కమిటీలు మారిపోవడంతో ఆ నిధులు వినియోగించుకోలేని పరిస్థితి ఏర్పడింది. మిగిలిన పాఠశాలలకు సంబంధించి కొంత మేర నిధులు అందుబాటులో వున్నప్పటికీ.. పనులు పూర్తిచేయడానికి చాలవు.

అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 700 విద్యార్థులు వున్నారు. ప్లస్‌టులో మరో 200 మంది చదువుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 'నాడు-నేడు' కార్యక్రమం కింద రూ.18 లక్షల అంచనా వ్యయంతో మూడు అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టారు. కానీ ఇంతవరకు పూర్తికాలేదు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 17 తరగతి గదులు వున్నప్పటికీ విద్యార్థుల సంఖ్య అధికంగా వుండడంతో వసతి చాలడంలేదు. అనకాపల్లి మండలం కొండకొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అదనపు గదుల నిర్మాణ పనులు తుది దశలో నిలిచిపోవడంతో వసతి కొరతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు పాఠశాలలే కాదు.. జిల్లాలో అన్ని మండలాల్లో సుమారు 240 భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా వున్నాయి. ఇటువంటి పరిస్థితి దేవరాపల్లి, కె.కోటపాడు, రోలుగుంట, రావికమతం, నాతవరం, గొలుగొండ మండలాల్లోని శివారు గ్రామాల్లో అధికంగా వుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తి భవన నిర్మాణాలపై సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం ఈఈ నరసింగరావును 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. అవసరమైన నిధులు విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేశామని తెలిపారు. పరిపాలన పరమైన ఆమోదం లభించిన వెంటనే పనులు చేపట్టి పూర్తిచేస్తామన్నారు.

అన్నదాతల్లో తుఫాన్ బెంగ

వాతావరణం మారడంతో ఆందోళన

- ఆకాశం మేఘావృతంతో కోత కోసిన పొలాల్లో హడావిడిగా కుప్పలు
- వరి పంట పక్వానికి వచ్చినపొలాల్లో కోతలు వాయిదా
- జిల్లాపై తుఫాన్ ప్రభావం అంతగా ఉండదంటున్న అధికారులు



చినపాచిలలో వరి పనలను కుప్పలు పెడుతున్న రైతులు



మునగపాకలో కోతకు వచ్చిన వరి పైరు

అనకాపల్లి/ రావికమతం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తుఫాన్ ప్రభావంతో శనివారం జిల్లాలోని పలు మండలాల్లో ఆకాశం మేఘావృతమైంది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం అనకాపల్లి జిల్లాపై తుఫాన్ ప్రభావం అంతగా వుండనప్పటికీ.. వాతావరణం మారిపోవడంతో రైతులు.. ముఖ్యంగా వరి సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 60 వేల హెక్టార్ల పైచిలుకు విస్తీర్ణంలో వరి సాగు చేపట్టగా, ఇంతవరకు సగానికిపైగా విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యాయి. వీటిల్లో ఎక్కువ శాతం ఇంకా కుప్పలు వేయలేదు. శుక్రవారం వరకు ఎండకాస్తూ పొడి వాతావరణం నెలకొనగా.. శనివారంనాటికి వాతావరణం మారిపోయి, ఆకాశం మేఘావృతమైంది. దీంతో వరి పంటను ఇప్పటికే కోతకోసిన రైతులు హడావిడిగా కుప్పలు వేయడం మొదలుపెట్టారు. దీంతో కూలీలకు గిరాకీ పెరిగి, అవసరం మేరకు లభించని పరిస్థితి ఏర్పడింది. కాగా పంట పక్వానికి ... మిగతా 8వ పేజీలో


ఆయుర్వేదానికి ఆదరణ

- ఆస్పత్రులకు పెరుగుతున్న రోగుల రాక
- పుష్కలంగా మందుల సరఫరా




వేంపాడులో ఆయుర్వేద ఆస్పత్రి

నక్కపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): **ఆయుర్వేద వైద్యాన్ని అందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా ఎన్‌డీఏ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నది. ఆయుర్వేద ఆస్పత్రులకు పూర్తిస్థాయిలో వసతి సదుపాయాలను కల్పించడంతోపాటు వైద్యులు, సిబ్బందిని నియమించి, సకాలంలో మందులను సరఫరా చేస్తున్నది. దీంతో ఆయుర్వే ఆస్పత్రులకు క్రమేపీ రోగుల సంఖ్య పెరుగుతున్నది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయుష్ శాఖ కమిషనర్ దినేశ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఇటీవల అన్ని ఆస్పత్రులకు మందులను సరఫరా చేశారు.**



రోగికి మందులు ఇస్తున్న ఫార్మసిస్ట్

జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, కొరుప్రోలు, వేంపాడు, కన్నూరుపాలెం, నర్సీపట్నం, సర్వసిద్ధి, గవరవరం, దేవరాపల్లి, పరవాడ, హరిపాలెంలో ఆయుష్ ఆస్పత్రులు ఉన్నాయి. రోగులకు అవసరమైన వివిధ రకాల మందులను అందుబాటులో వుంచి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆయుష్షును పెంచి, ఆరోగ్యాన్ని అందించడం, ఒత్తిడిని జయించి ప్రశాంతంగా జీవించేందుకు ఆయుర్వేద మందులు ఎంతో దోహదపడతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. పిల్లల్లో రక్తహీనత, దగ్గు, జలుబు, జ్వరం, శ్వాసకోశ, జీర్ణకోశ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు అన్ని ఆయుర్వేద ఆస్పత్రుల్లో అందుబాటులో వున్నాయి. పెద్దలకు కీళ్ల వాతం, కాళ్ల నొప్పులు, షుగర్, బీపీ, చర్మవ్యాధులు, సొరియాసిస్, గ్యాస్ట్రిక్, తదితర వ్యాధుల నివారణకు మందులను ఉచితంగా అందజేస్తున్నారు. దీంతో ఆయుర్వేద ఆస్పత్రుల్లో ఓపీ క్రమంగా పెరుగుతున్నది. ఒక్కో ఆస్పత్రికి రోజుకు సగటును 50 మంది వరకు వస్తున్నారు. నర్సీపట్నం, అనకాపల్లి ఆస్పత్రుల్లో ఓపీ అధికంగా వుంటున్నది. మరోవైపు ఆస్పత్రుల ఆవరణల్లో ఆహ్లాదకరమైన వాతావరణం వుండేలా ఔషధ గుణాలుగల మొక్కలను పెంచుతున్నారు. ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రఘు కోరుతున్నారు.





వేంపాడు ఆస్పత్రి ఆవరణలో ఔషధ మొక్కలు. (ఇన్‌సెట్‌లో) డాక్టర్ కె.రఘు, వేంపాడు ఆయుష్ ఆస్పత్రి వైద్యాధికారి

డీజిల్ మాఫియా

ఉమ్మడి జిల్లాలో 'నకిలీ' విక్రయాలు

- పరిశ్రమల అవసరాల పేరుతో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడుల నుంచి హైడ్రోకార్బన్ ఆయిల్, డిస్టిలేట్ ఆయిల్, పారాఫిన్ ఆయిల్ వంటివి దిగుమతి
- డీజిల్ మాదిరిగా రంగు, డెన్సిటీ కోసం రసాయనాలు మిక్సింగ్
- అడ్డరోడ్డు, గాజువాక, పెందుర్తి, మల్కాపురంలో బ్లెండింగ్ యూనిట్లు
- అక్కడి నుంచి నేరుగా ట్రాన్స్‌పోర్టు యజమానులకు విక్రయం
- ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు రెండు లక్షల లీటర్ల అమ్మకం
- రోజుకు రూ.31 లక్షల ఆదాయం కోల్పోతున్న రాష్ట్ర ప్రభుత్వం
- నకిలీ ఆయిల్ వినియోగంతో వాహనాల జీవితకాలం తగ్గుదల, కాలుష్యం పెరుగుదల





పెందుర్తిలో అనధికారిక డీజిల్ ప్లాంట్. (ఇన్‌సెట్‌లో) డీజిల్ ట్యాంకర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నకిలీ డీజిల్ మాఫియా రెచ్చిపోతోంది. పరిశ్రమల అవసరాల కోసమని చెప్పి తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి మినరల్ హైడ్రోకార్బన్ ఆయిల్, డిస్టిలేట్ ఆయిల్, పారాఫిన్ ఆయిల్ వంటి వంటిని తీసుకువచ్చి.. రంగు, డెన్సిటీ కోసం కొన్ని రకాల రసాయనాలను కలిపి తక్కువ ధరకు లారీ ట్రాన్స్‌పోర్టు యజమానులకు విక్రయిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వ్యాట్ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండిపడడంతోపాటు వాహనాల జీవితకాలం తగ్గిపోవడం, కాలుష్య సమస్య పెరగడం వంటివి జరుగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశ్రమల ఆయిల్‌ను పెందుర్తి సమీపంలోని గుర్రంపాలెం వద్ద గల ప్లాంటులో డీజిల్‌గా మారుస్తుండగా ఈనెల 25న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేశారు. ట్యాంకర్‌తోపాటు భారీగా ఆయిల్‌ను సీజ్ చేసి, నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐఓసీ, నయారా, రిలయన్స్ వంటి ... మిగతా 8వ పేజీలో

తహశీల్దారు కారుకు స్థానచలనం

- ప్రధాన ద్వారం వద్ద నుంచి పక్కకు మార్పు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పక్కకు మార్చిన తహశీల్దార్ కారు

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయం ముందు అడ్డంగా పార్కింగ్ చేస్తున్న తహశీల్దార్ కారును అక్కడి నుంచి పక్కకు తొలగించారు. కార్యాలయానికి వచ్చేవారు లోపలికి సాఫీగా వెళ్లేందుకు వీలు లేకుండా తహశీల్దారు కారును ప్రధాన ద్వారం ఎదుట పార్కింగ్ చేస్తున్నారు. దీనిపై 'కార్యాలయానికి దారేది' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం కథనం ప్రచురితమైంది. తహశీల్దార్ రామారావు వెంటనే స్పందించి తన కారును పక్కన పార్కింగ్ చేయించారు.

అడవుల్లో జంతు గణన

రేపటి నుంచి ప్రారంభం

- 1-3 తేదీల వరకు మాంసాహార జంతువులు..
- 6-8 తేదీల వరకు శాకాహార జంతువుల మదింపు
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు







నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నాలుగు సంవత్సరాలకు ఒక సారి జరిగే వన్యప్రాణుల గణన డిసెంబరు ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు నిర్వహించడానికి అటవీ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు మాంసాహార జంతువులు.. అంటే పులులు, చిరుత పులులు, ఖడ్గ మృగాలు, ఎలుగుబంట్లు వంటి వాటిని లెక్కిస్తారు. అటవీ శాఖ అధికారులు రోజూ ఉదయం ఆరు గంటలకు వన్యప్రాణుల గణనను మొదలుపెడతారు. అటవీ ప్రాంతంలో రోజుకు ఐదు కిలోమీటర్ల చొప్పునతిరుగుతారు. ఈ సందర్భంగా ఆయా జంతువుల పాదముద్రలు, మలవిసర్జన వ్యర్థాలు, చెట్ల మీద ఉన్న గోర్లు గుర్తులు వంటి వాటి ద్వారా ఆయా జంతువులను గుర్తిస్తారు. మూడు రోజులపాటు సేకరించిన వివరాలను 4, 5 తేదీల్లో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. తర్వాత 6, 7, 8 తేదీల్లో అటవీ సిబ్బంది రోజుకు రెండు కిలోమీటర్ల చొప్పున అటవీ ప్రాంతంలో తిరుగుతూ కణుజు, అడవి పందులు, కొండ గొర్రె, దుప్పులు వంటి శాకాహార జంతువులను లెక్కిస్తారు. తొలుత 400 మీటర్లు, తరువాత 800 మీటర్లు, 1,200 మీటర్లు, 1,600 మీటర్లు, 2 వేల మీటర్లు మార్క్ చేసుకొని ప్రత్యక్షంగా లేదా ఆనవాళ్ల ద్వారా గుర్తించిన శాకాహార జంతువుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. నాలుగేళ్ల క్రితం నిర్వహించిన సర్వే వివరాలతో సరిపోల్చుకుని, ఏయే జంతువులు తగ్గాయి లేదా పెరిగాయి అన్న వివరాలను కూడా పొందుపరుస్తారు.

సహకరించాలి

చోడవరం రేంజి అధికారి రవివర్మ



పీవీ రవివర్మ, చోడవరం రేంజి అధికారి

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటి నుంచి 8వ తేదీ వరకు అటవీప్రాంతంలో నిర్వహించే జంతుగణనకు ఆయా ప్రాంతాల్లోని ప్రజలు సహకరించాలని స్థానిక అటవీ శాఖ రేంజి అధికారి పీవీ రవివర్మ కోరారు. చిట్టచివరిగా 2022లో సర్వే నిర్వహించామని, గతంలో సర్వే వివరాలను ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసేవారమని, ఈసారి వన్యప్రాణుల గణన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. సర్వేకు సంబంధించి అటవీ శాఖ సిబ్బందికి జిల్లా, డివిజన్, రేంజి స్థాయిలో శిక్షణ ఇచ్చారని చెప్పారు. చోడవరం రేంజి పరిధిలో అడవి మేకలు, నెమళ్లు. కణుజులు, అడవికోళ్లు, దుప్పిలు, అడవి దున్నలు ఉన్నాయని అన్నారు.

అందరికీ ఉపయోగపడేలా జెట్టీ నిర్మాణం

▸ ఎమ్మెల్యే విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అందరికీ ఉపయోగపడేలా పూడిమడకలో జెట్టీ నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. శనివారం పూడిమడకలో పీఎంఎంఎస్‌వై కింద మంజూరైన ఓఎంటీ ఇంజన్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారులు, మత్స్యకారేతరులకు ఉపయోగపడేలా జెట్టీని పూడిమడకలో నిర్మిస్తామన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పూడిమడక మత్స్యకార యువతకు సెజ్ కర్మాగారాల్లో ఉపాధి అవకాశాలు కల్పించటానికి చర్యలు చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మొహమ్మద్ ఆసీఫ్



విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మేజర్ ఆసీఫ్

పాయకరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని 18వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ మొహమ్మద్ ఆసీఫ్ అన్నారు. శనివారం స్థానిక స్పేసెస్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఎన్‌సీసీ దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్‌సీసీ విద్యార్థులకు పూర్తి స్థాయి క్రమశిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు లక్ష్యం చేరే వరకూ విశ్రమించకూడదన్నారు. అంతకుముందు మేజర్ ఆసీఫ్ ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆసీఫ్‌కి శ్రీప్రకాశ్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ జ్ఞాపికను అందజేశారు. అనంతరం విద్యార్థులు పిరమిడ్లు తదితర ప్రదర్శనలు, విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ఎస్.భానుమూర్తి పాల్గొన్నారు.

సర్వే నంబర్లను సరిచేయాలని వినతి

రాంబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మామిడివాడ రెవెన్యూలో తప్పులు తడకగా ఉన్న భూముల సర్వే నంబర్లను సరిచేయాలని కోరుతూ రాంబిల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ ఎరిపల్లి చిట్టిబాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కరెడ్ల ఈశ్వరరావు, నాయకులు లాలం తాతబాబు, సత్యనారాయణ శనివారం తహశీల్దార్ శ్రీనివాసరావుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడివాడ రెవెన్యూ పరిధిలో గ్రామ రీ సర్వేలో కొరిలేషన్ ప్రాబ్లం సర్వే నంబర్లు తప్పుగా నమోదయ్యాయని, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రామచంద్రపాలెం ఆరోగ్యకేంద్రం తనిఖీ

కోటవురట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపాలెం ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ లీడర్, జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆపీసర్ డాక్టర్ ప్రశాంతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హెల్త్‌సెంటరులో రికార్డులు, పాఠశాల విద్యార్థుల రక్తపరీక్షల రిపోర్టులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ఎంతమంది గర్భిణులున్నారు.. కుష్ఠు వ్యాధి సర్వే చేస్తున్నారా లేదని గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆరోగ్యసిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమెతో పాటు ఎస్‌వో రామచంద్ర, డీపీవో జగదీష్, జనార్దన్, డాక్టర్ సంతోష్, డాక్టర్ ధనలక్ష్మి, ఎంపీహెచ్‌వో బెన్నయ్య పాల్గొన్నారు.

గణపర్తి గౌరీపరమేశ్వరుల ఉత్సవానికి వర్గపోరు

నవంబరులో జరగాల్సిన ఉత్సవం డిసెంబరుకు వాయిదా

తహశీల్దార్ చొరవతో 24 మందితో ఉత్సవ కమిటీ

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపర్తి గౌరీపరమేశ్వరుల ఉత్సవానికి వర్గపోరు అడ్డంకిగా మారింది. దీంతో నవంబరు నెలాఖరున జరగాల్సిన ఉత్సవం డిసెంబరుకు వాయిదా పడింది. గ్రామంలో పూర్వ కాలం నుంచి గౌరీపరమేశ్వరులు ఉత్సవం నిర్వహిస్తున్నా ఇటీవల వర్గపోరుతో పోలీసు స్టేషన్ వరకు వెళ్లారు. పోలీసులు చెప్పినా వినకపోవడంతో వివాదం తహశీల్దార్ వద్దకు వెళ్లింది. అన్ని వర్గాల వారితో సమావేశం నిర్వహించినా సానుకూలత రాకపోవడంతో ఉత్సవం నిర్వహణ తేదీని ఎవరు ప్రకటించవద్దని తహశీల్దార్ నోటీసు జారీ చేశారు. ఆ తరువాత ఉత్సవ కమిటీ ఏర్పాటుకు సంబంధించి ఒక్కోవర్గంతో మాట్లాడి వర్గానికి ఆరు పేర్లు సూచించమని కోరారు. తహశీల్దార్ సత్యనారాయణ ఆదేశాలతో నాలుగు వర్గాల నుంచి మొత్తం 24 పేర్లు రావడంతో వారందరితో శనివారం ఉత్సవ కమిటీని తహశీల్దార్ ప్రకటించారు. అంతేకాదు కొన్ని నిబంధనలు కూడా విధించారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో ఉత్సవం జరుగుతుందని, వివాదాలు సృష్టించాలని ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక కూడా జారీ చేశారు. రెండు రోజుల్లో సీఐని కలిసి వారి సూచనలు, సలహాలకు అనుగుణంగా ఉత్సవ తేదీని నిర్ణయించుకోవడం జరుగుతుందని సర్పంచ్ చదరం వెంకట సూర్య గణేష్ నాయుడు తెలిపారు.

నానో యూరియా బహుళ ప్రయోజనకరం

▸ ఆత్మ పథకం సంచాలకుడు అప్పలస్వామి

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగం బహుళ ప్రయోజనకరమని ఆత్మ పథకం సంచాలకుడు అప్పలస్వామి అన్నారు. మండలంలో వాడ్రాపల్లి, చూచుకొండ గ్రామాల్లో శనివారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నానో యూరియా క్షేత్రస్థాయి ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 500 మిల్లీలీటర్లు నానో బాటిల్ ఖరీదు రూ.225 అని అన్నారు. ఇది ఎకరా విస్తీర్ణంలో పొలానికి పిచికారీకి సరిపోతుందన్నారు. పొడి గత్తంలో కలుపుకొని పొలంలో జల్లుకోవాలన్నారు. పశుగ్రాసానికి కూడా వినియోగించవచ్చునని తెలిపారు. నానో పిచికారీ చేసిన పొలం పచ్చగా, ఏపుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో జ్యోత్స్నకుమారి, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, రైతులు మళ్ల శేషు, పెంటకోట శివ, పెంటకోట హరేరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

కోటవురట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): చెత్త ద్వారా వర్మీకంపోస్టు తయారీ చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చుకునేందుకు సంపద కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో తడి,పొడి చెత్త సేకరణ, తద్వారా వర్మీ కంపోస్టు తయారీ చేసే విధానంపై డ్వాక్రాగ్రూపులకు ఒకరోజు శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువు తయారీలో వానపాములు పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, రఘురామ్, వెలుగు ఏపీఎం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆది నుంచి ఎన్ని కష్టాలో..

▸ ఆకుమడులతో మొదలు ...

▸ పంట చేతికొచ్చే దశలో దిత్వా తుఫాన్ గుబులు

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆకుమడులతో మొదలైన వరి రైతు సాగు కష్టాలు పంట పక్వం దశలో కూడా వీడడం లేదు. మండలంలో ఐదారేళ్ల క్రితం వరకు కేవలం 20 శాతానికే పరిమితంగా ఉన్న వరి సాగు ఇప్పుడు 60 శాతం దాటింది. దానికి కారణం చెరకు పంటకు మద్దతు ధర లేకపోవడమేనని రైతులు చెబుతున్నారు. ఏటా పెరుగుతున్న వరిసాగు విస్తీరణానికి అనుగుణంగా తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,450 హెకార్లలో వరి సాగును రైతులు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆకుమడులు స్థాయిలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. చాలా ప్రాంతాల్లో మొలకదశకు వచ్చిన ఆకుమడులు నీటి ముంపునకు గురికావడంతో రెండోసారి కూడా వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ తరువాత పలు కష్టాలను అధిగమించి వరినాటు పూర్తి చేశారు. తర్వాత ఆశాజనకంగా ఉన్న సమయంలో అక్టోబరు నెలాఖరులో వచ్చిన మొంథా తుఫాన్ విధ్వంసం చేసింది. లోతట్టు ప్రాంతాల్లో నీటి ముంపునకు గురైన పొలాలు పనికిరాకుండా పోయాయి. తేరుకున్న పొలాల్లో చాలా వరకు ఇప్పుడు కోత దశలో ఉన్నాయి. ఈ సమయంలో దిత్వా తుఫాన్ హెచ్చరికలు రైతుల్లో గుబులు పుట్టిస్తున్నాయి. దానికి అనుగుణంగానే శనివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. పక్వానికి వచ్చిన వరి చేనును కోయడమా.. ఆగిపోవడమా..? అని తేల్చుకోలేని సందిగ్ధంలో రైతులు ఉన్నారు. ఆలస్యంగా నాట్లు వేసిన చోట వరి పంట పక్వానికి రావడానికి నెల రోజులు పడుతుంది. ఆ పంటపై కూడా తుఫాన్ ప్రభావం చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆద్యంతం రైతులను ప్రకృతి వెంటాడుతూనే ఉంది.

వరి రైతు వెన్నులో తుఫాన్ వణుకు

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వరి సాగు ఆశాజనకంగా వుందని అన్నదాతలు



కోత దశకు చేరుకున్న వరి పొలాలు

సంబరపడుతున్న తరుణంలో దిత్వా తుఫాన్ హెచ్చరికతో వారిలో వణుకు ప్రారంభమైంది. మొంథా తుఫాన్ తీవ్రంగా భయపెట్టినా పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల్లోని పల్లపు ప్రాంతాల్లో మాత్రమే కొంత మేర వరి పొలాలకు పాక్షిక నష్టం వాటిల్లింది. ఎందుకంటే కేవలం ఒక్కరోజు మాత్రమే మొంథా తుఫాన్‌తో భారీ వర్షం కురిసింది. డిసెంబరు నెల రెండో పక్షం నుంచి వరి పంట కోతకు వస్తోంది. అక్కడక్కడా కొన్ని తెగుళ్లు సోకినా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సహకారంతో రైతులు సకాలంలో యాజమాన్య చర్యలు చేపట్టారు. మరికొద్ది రోజుల్లో చాలా చోట్ల వరి పొలాల్లో కోతలు ప్రారంభించేందుకు అన్నదాతలు సిద్ధపడుతున్నారు. మండలంలో 5,450ఎకరాల్లో రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. వరి కోతకు వచ్చే సమయంలో దిత్వా తుఫాన్ భయం మరలా అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. దిత్వా తుఫాన్‌తో భారీ వర్షాలు పడితే వరికి నష్టం కలుగుతుందని రైతులు భయపడుతున్నారు. ఈ తుఫాన్ గండం గడిస్తే.. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వరి దిగుబడులు చేతికందుతాయని రైతులు భావిస్తున్నారు. అయితే భారీ గాలులతో వర్షం కురిసి, పంట పడిపోయి నీటిలో మునిగితే నష్టం వాటిల్లుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. లేదా పంట కోసిన తరువాత భారీ వర్షాలు కురిస్తే ఇబ్బంది వుంటుందని, అందువల్ల రైతులు ఆందోళన చెందనవసరం లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

దోమలపై దండయాత్ర చేయండి

▸ అధికారులకు ఛైర్‌పర్సన్ రమాకుమారి ఆదేశం

▸ ప్రజాధనం వృథా : వైస్ ఛైర్మన్లు ఆరోపణ



సమస్యలపై ప్రశ్నిస్తున్న వైస్ ఛైర్మన్‌లు బెజవాడ, గుప్తాలు

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో దోమల తీవ్రత పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఛైర్‌పర్సన్ రమాకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం ఛైర్‌పర్సన్ అధ్యక్షతన మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. అయితే నిర్దేశించిన సమయం కన్నా గంటన్నర పాటు కౌన్సిల్ సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. ఛైర్‌పర్సన్ రాక కోసం అధికారులు, పాలకవర్గ సభ్యులు వేచి చూడాల్సి వచ్చింది. ఛైర్‌పర్సన్ వచ్చిన తర్వాత జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలను మునిసిపల్ ఏఈ చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో దోమల సంచారం పెరిగిందని ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మునిసిపల్ వైస్ ఛైర్మన్ గుప్తా మాట్లాడుతూ మునిసిపాలిటీలో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. కొమ్మాయిగుండం పార్కు అభివృద్ధి కోసమని రూ.80 లక్షలు వెచ్చించినా కొందరు అధికారుల నిర్లక్ష్య పనితీరు కారణంగా ఈ పార్కు ఎందుకు పనికిరాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న రాళ్ల చెరువు చుట్టూ రూ.2 లక్షలతో ఫెన్సింగ్ వేయడమేమిటని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని ప్రజలకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని వైస్ ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తాలు కోరారు. ఎలమంచిలిలో హాకీ క్రీడకు ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ అంశాన్ని అజెండాలో పొందుపరిచి తీర్మానం చేయాలని ఛైర్‌పర్సన్‌ను కోరారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించారు. మునిసిపాలిటీలో ఏడు వేల మొక్కలను పెంచాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, ఏఈలు గణపతి సుబ్బారావు, నానాజీ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

టేబుల్ అజెండాగా 3 అంశాలు

మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మూడు అంశాలను టేబుల్ అజెండాగా అనుమతించడం జరిగిందని ఛైర్‌పర్సన్ రమాకుమారి తెలిపారు. ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని పాలకవర్గ సభ్యుల కోరిక మేరకు తీర్మానించామన్నారు. అదేవిధంగా పట్టణంలోని నాయిబ్రాహ్మణులకు, టైలర్స్ అసోసియేషన్‌లకు కమ్యూనిటీ భవనాల కోసం స్థలం మంజూరుకై అజెండాలో పొందుపరచామన్నారు.

పేదల కోసం పోరాటమే కాంగ్రెస్ ధ్యేయం

▸ ఏఐసీసీ పరిశీలకులు సుశాంత్‌మిశ్రా



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు సుశాంత్‌మిశ్రా

పాయకరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం పోరాటం చేయడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని ఏఐసీసీ పరిశీలకులు సుశాంత్‌మిశ్రా అన్నారు. శనివారం స్థానిక లింగాలతోటకాలనీలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మారుతి నారాయణచక్రవర్తి ఆధ్వర్యంలో పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుశాంత్‌మిశ్రా మాట్లాడుతూ రాహుల్‌గాంధీ అధికారం కంటే ప్రజల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షానే పోరాటాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజల తరఫున పోరాటాలు చేయడం ద్వారా ప్రజల మన్ననలు పొంది గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. పార్టీకి కార్యకర్తలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా సురేష్, సీనియర్ నాయకులు బోడా వెంకట్, ఎంకేఎం.శేఖర్, పాయకరావుపేట యూత్ నాయకులు కర్రి హేమంత్‌కుమార్, పార్టీ నక్కపల్లి మండల అధ్యక్షుడు ప్రగడ చక్రధర్, మోర్త సింహాచలం, ఎస్ఎస్‌వీ. సత్యనారాయణ, నడింపల్లి నూకరాజు, చిట్టిమూరి సుబ్బారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు



కోటవురట్లలో మండల స్థాయి పోటీలు ఆడుతున్న ఉపాధ్యాయులు

పాయకరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల మండల స్థాయి ఆటల పోటీలు శనివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొనగా, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన త్రోబాల్ పోటీల్లో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో ఉదయం, మధ్యాహ్నం జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ సందర్భంగా ఎంఈఓ కేఎస్.గాంధీ మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైనవారు డిసెంబరు 13,14 తేదీల్లో నర్సీపట్నంలో జరిగే డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 రమేష్‌బాబు, పీఈటీలు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం మహిళా ఉపాధ్యాయుల మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల మహిళా ఉపాధ్యాయులకు నిర్వహించిన ఈ పోటీలను ఎంఈవోలు అరుణ్ కుమార్, సూర్యప్రకాష్, హెచ్‌ఎం రమణ ప్రారంభించారు. త్రోబాల్ పోటీలో ఉపాధ్యాయినిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉపాధ్యాయులకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

నక్కపల్లిలో..

మండలంలోని గొడిచెర్ల జడ్పీ హైస్కూల్ మైదానంలో శనివారం ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలునిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి 35 మంది (పురుష)ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఈవోలు కె.నరేశ్, నాగన్నదొర, సీనియర్ హెచ్‌ఎంలు వేమగిరి నూకరాజు, సత్యకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. 9న జరిగే డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలకు కొందరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు.

కోటవురట్లలో..

కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో ఉపాధ్యాయులకు శనివారం క్రీడా పోటీలను ఎంఈవోలు రామారావు, లక్ష్మీనారాయణ, హైస్కూల్ హెచ్‌ఎం సత్యాడ సుకుమార్ ప్రారంభించారు. ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళ ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఇక్కడ గెలుపొందిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారవేత్తలుగా ఎదగాలని, అప్పుడే ఆర్థిక స్వావలంబన సాధించగలరని సెర్ప్ ఏపీఎం కె.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంటర్‌ప్రెన్యూర్ డవలప్‌మెంట్ పై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ఆవశ్యకతను ఏపీవో శ్రీనివాస్ తెలియజేశారు. వ్యాపారం చేసే ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆహారానికి సంబంధించి వస్తువులను అమ్మేవారు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను పొందాలని సూచించారు. ప్రభుత్వం, బ్యాంకులిచ్చే రుణాల కోసం వివరించారు. ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నం విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న జనసేన నాయకుడు గెడ్డం బుజ్జి

ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని 4న ర్యాలీ

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు శనివారం మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఛైర్‌పర్సన్ రమాకుమారిలకు వినతిపత్రాలు అందజేశారు. ఎలమంచిలిలో రైల్వే స్టేషన్, బస్టాండ్, కోర్టులు, సబ్ జైలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రి వంటివి ఉన్నాయని పౌరసేవా సంఘం అధ్యక్షుడు పి. వెంకటరావు తెలిపారు. ఎలమంచిలిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వచ్చే నెల 4వ తేదీన ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్నట్టు నూతనంగా ఏర్పాటైన రెవెన్యూ డివిజన్ సాధన సమితి ప్రతినిధులు కె.శ్రీహరి, ఎల్లపు రాజు, ఆకుల వెంకటేష్ పాల్గొన్నారు.

రిటైర్డు టీచర్‌కు ఘన సత్కారం

ఎస్.రాయవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన గెడ్డపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బుద్ధ రమణ అప్పారావును శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉద్యోగ కార్యక్రమంలో బుద్ధ రమణ అప్పారావు దంపతులను డిప్యూటీ డీఈఓ అప్పారావు, ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాస్కరరావు పాల్గొన్నారు.

భూ సమస్యల మండల కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం

కోటవురట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):రైతుల భూ వివాదాల పరిష్కారం కోసం శనివారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మండల లెవెల్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశమైంది. తహశీల్దార్ తిరుమలబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కొడవటిపూడి, పీకేపల్లి, టి.జగ్గంపేట, జల్లూరు గ్రామాల్లో రైతుల భూ సమస్యలపై వాదోపవాదాలు విన్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వాటిలో నాలుగు సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వాయిదా వేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎస్ఐ రమేష్, డీటీ రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

▸ పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

రాంబిల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ఉండాలని పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ అన్నారు. శనివారం రాంబిల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, అనకాపల్లి డీటీఓ జి.మనోహర్, ఎంవీఐ కె.ప్రవీణ్ కుమార్ ప్రసంగించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలకు కీలక కారణమన్నారు. కార్యక్రమంలో సీఐ సిహెచ్ నర్సింగరావు, ఎస్ఐ నాగేంద్ర, స్టేషన్ సిబ్బంది, లారీ,స్కూల్‌బస్సు, ఆటో డ్రైవర్లు, స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోం మంత్రిపై ఆరోపణలు చేస్తే ఉపేక్షించం

▸ తెలుగు మహిళల హెచ్చరిక



విలేకర్లతో మాట్లాడుతున్న తెలుగుమహిళా నేతలు

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు అడ్డరోడ్డులో ల్యాబ్ లేదని గుర్తించిన అధికారులు సీజ్ చేస్తే, ఆ విషయాన్ని హోం మంత్రి అనితకు ముడిపెట్టి, ఆరోపణలు చేయడం తగ్గదని నియోజకవర్గ తెలుగు మహిళలు తీవ్రస్థాయిలో అన్నారు. నియోజకవర్గం తెలుగు మహిళ కన్వీనర్ రమాకుమారి, నక్కపల్లి, ఎస్.రాయవరం తెలుగు మహిళ అధ్యక్షులు షేక్ మున్నీషా బేగం, జ్యోతి, మరో మహిళా నేత నాగలక్ష్మి శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జ్యోతి ల్యాబ్ నడుపుతున్న మహిళ ఎవరో కూడా హోం మంత్రి అనితకు తెలియదన్నారు. కేవలం పేపర్ పబ్లిసిటీ కోసమే హోం మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, మరోసారి అలా మాట్లాడితే మాత్రం ఆమె ఇంటి వద్దే ధర్నా చేస్తామని హెచ్చరించారు. హోం మంత్రి కక్ష కట్టారని దుష్ప్రచారం చేయడం వెనుక ఎవరున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ప్రకారం లాబ్ నడిపితే ఎందుకు సీజ్ చేస్తారని ప్రశ్నించారు.

స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చిన వారికి న్యాయం చేయాలి

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఏర్పాటు కానున్న ఆర్సిలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ పరిశ్రమ కోసం భూములిచ్చిన నక్కపల్లి మండల రైతులకు న్యాయం చేయాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు, భూములిచ్చిన నిర్వాసితులకు అన్ని విధాలా సహకరిస్తామని, ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన మాటలు అమలుకావడం లేదన్నారు. భూములిచ్చిన రైతుల కుటుంబాల్లో పెళ్లయిన ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనుల నుంచే స్థానికులకు, నిర్వాసితులకు ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వైసీపీ నేతలు గంటా తిరుపతిరావు, సూరకాసుల గోవింద్, తళ్లా భార్గవ్, పిక్కితాతీలు తదితరులున్నారు.

డ్రగ్స్‌కి యువత దూరంగా ఉండాలి : సీఐ

అచ్యుతాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం పూడిమడక శివారు కొండపాలెంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కి అలవాటు పడిన యువకులతో పాటు వారి కుటుంబాలు కూడా విచ్ఛిన్నమవుతాయన్నారు. మత్తుపదార్థాలకు అలవాటు పడితే నిత్య జీవితం దుర్భరమవుతుందన్నారు. బాలురు డ్రైవింగ్ చేయడం, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించటడం, సెల్‌ఫోన్‌ల ద్వారా అసభ్యకరపోస్టులు పెట్టడం వంటివి కూడా నేరమన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, మత్స్యకారులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లడం ఆనందదాయకం'

ఎలమంచిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని సచివాలయాల్లో ఉద్యోగాలు చేస్తున్న కొందరు ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లడం అభినందనీయమని ఛైర్‌పర్సన్ రమాకుమారి అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లిన ముగ్గురితో పాటు జూనియర్ అసిస్టెంట్ నుంచి ప్రమోషన్‌పై సాలూరు మునిసిపాలిటీకి బదిలీ అయిన సంతోష్‌ను పాలకవర్గ ప్రతినిధులంతా ఘనంగా సన్మానించారు. సచివాలయాల్లో పనిచేసిన కుమారి, బాబా సాయి, గణపతిరాజు తేజస్విలు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో వీరందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, ఏఈలు మునిసిపల్ వైస్ ఛైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'హక్కులను సద్వినియోగం చేసుకోవాలి'

మునగపాక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారంతిమ్మరాజుపేట దళిత కాలనీలో పౌర హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.హక్కులకు భంగం కలిగితే ఫిర్యాదు ద్వారా న్యాయం పొందవచ్చునని తెలిపారు. ఎస్ఐ పి.ప్రసాదరావు మాట్లాడుతూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు.

శత చండీయాగం ప్రారంభం

- వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ శారదా నది ఒడ్డున గంగా హారతి
- భారీగా తరలి వచ్చిన భక్తజనం


శారదానది ఒడ్డున గంగా హారతి ఇస్తున్న వేద పండితులు


గంగాహారతిని వెలిగిస్తున్న అర్చక ఎగ్జామినర్ శ్రీరామాచార్యులు

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శివ పంచాయతన సహిత శత చండీయాగ మహోత్సవాలు శనివారం ఇక్కడ ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత గణనాథుని స్మరిస్తూ విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, శారదానది తీరాన గంగాహారతి వంటి కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించారు. అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలి ఆయన తొలి పూజ చేశారు. యాగశాల ప్రవేశం, అగ్ని మదనం, దీక్షధారణ యజ్ఞ ప్రారంభాది హోమాలను జరిపారు. ముందుగా గాంధీనగరంలో ఉన్న సంయుక్త విద్యా సంస్థల ప్రాంగణంలో రామాచార్యులు వేదమంత్రాలను పఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వశాంతి కోసం ఈ యాగం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు రేజేటి చక్రవర్తి, వేదపండితులు, పట్టణ పెద్దలు చక్రవర్తి భక్తబృందం పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : పీలా


సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందిస్తున్న పీలా గోవింద

తుమ్మపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో శనివారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను పలువురికి అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పేదల పక్షపాతిగా పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, టిడ్కో గృహాలను అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రతి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రి బాబి, గొర్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలను త్వరితగతిన శుభ్రం చేయండి : జడ్సీ


నిదానందొడ్డిలో డ్రైనేజీని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీలను త్వరితగతిన శుభ్రం చేయాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. 82వ వార్డు పరిధిలోని నిదానందొడ్డి పరిసర ప్రాంతాల్లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. రైతు సంఘ భవనం సమీపంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీని పరిశీలించి సిబ్బంది పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే డ్రైనేజీల్లోని పూడిక తొలగించాలన్నారు. స్థానికులతో మాట్లాడుతూ ఎక్కడబడితే అక్కడ చెత్త వేయరాదని, అలా వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ చెత్తను డస్టు బిన్‌లలో వేసుకొని జీవీఎంసీ వాహనాలు వచ్చినప్పుడు వాటిలో వేయాలని సూచించారు. అలాగే రోడ్డుపై ఇసుక కుప్ప వేయడాన్ని పరిశీలించిన ఆయన సంబంధిత వ్యక్తులకు హెచ్చరిక జారీ చేయడమే కాకుండా జరిమానా విధించారు.

రైతు బజారు ఏర్పాటుకు రిలే నిరాహార దీక్ష



నెహ్రూచౌక్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనకాపల్లిలో రైతుబజారు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నెహ్రూచౌక్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ఇంత వరకూ ఇక్కడ ప్రభుత్వాలు రైతుబజారు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. తక్షణమే రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు, చోడవరం నియోజకవర్గ కన్వీనర్ వేగి మహాలక్ష్మినాయుడు, నారాయణరావు, పెంటకోట రమణబాబు, జి.వెంకటేశ్వరరావు, శంకర్, ఎం.విజయశంకర్ తదితరులు ఈ దీక్షల్లో పాల్గొన్నారు.


విశాఖలోని తూర్పు నౌకాదళం ఏర్పాటు చేసిన ఇండియన్ నేవల్ సింఫనిక్ ఆర్కెస్ట్రా సర్గంలో పాల్గొనేందుకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎయిర్‌పోర్టులో కలిసి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు - విశాఖపట్నం

ఆర్చి వద్ద నిలిస్తే.. అనారోగ్యమే!

- తేగాడ ఆర్చి వద్ద నెలల తరబడి పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఆటోల కోసం నిరీక్షించే వారికి భరించలేని దుర్వాసన
- పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం


తేగాడ వెళ్లే ప్రధాన రహదారి ఆర్చి వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం


రోడ్డు పక్కన దృశ్యం

కశింకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బయ్యవరం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న తేగాడ ఆర్చి వద్ద దుర్వాసన వెదజల్లుతోంది. నెలల తరబడి చెత్త పేరుకుపోవడంతో ఇక్కడ ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు వాపోతున్నారు. జాతీయ రహదారి నుంచి ఆర్చి లోపలకు తేగాడ, కొత్తపల్లి, బుచ్చెయ్యపేట, పేరంటాలపాలెం, జోగారావుపేట తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు ఉంది. దీంతో వందలాది మంది ప్రజలు ప్రయాణం చేస్తూ ఉంటారు. గ్రామీణ ప్రాంత మహిళలు నిత్యావసర సరకులు, వస్తువుల కొనుగోలుకు ఆటోలను ఆశ్రయించి ఇక్కడి నుంచే వెళుతుంటారు. అయితే ఆటోలు వచ్చేంత వరకు ఇక్కడ నిరీక్షించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తేగాడ ఆర్చి వద్ద నిలబడాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

చుట్టు పక్కలవారు చెత్తను తీసుకువచ్చి ఇక్కడున్న కాలువలో పడేస్తుండడంతో కాలువ నిర్వహణకు అడ్డంకిగా మారుతోంది. దీని వల్ల వర్షాలు కురిసినప్పుడు మురుగు నీరంతా రోడ్డుపైనే ప్రవహిస్తుందని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఇక్కడి సమస్యపై స్పందించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

ముత్యాలమ్మపాలెం తీరంలో మినీ జెట్టీ నిర్మాణానికి కృషి

- ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పెద్దిరాజు


సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పెద్దిరాజు

పరవాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ముత్యాలమ్మపాలెం తీరంలో మినీ జెట్టీ నిర్మాణానికి కృషిచేస్తానని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు హామీ ఇచ్చారు. శనివారం ఆయన ముత్యాలమ్మపాలెం తీరంలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పలు పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఆదరణ పథకం కింద మత్స్యకార మహిళలు చేపల వ్యాపారం చేసుకునేందుకు రూ.50 వేల నుంచి రూ. మూడు లక్షల వరకు ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు అవసరమయ్యే వేట పరికరాలను కూడా ప్రభుత్వం మంజూరు చేయనుందన్నారు. అనంతరం చైర్మన్‌ను మత్స్యకార నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల ముత్యాలు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ కృష్ణ, స్థానిక నాయకులు అర్జిల్ల రవి, చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, కొవిరి పెదముత్యాలుతో పాటు మత్స్యశాఖ అధికారులు రవితేజ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడలు


ఉత్సాహంగా క్రికెట్ పోటీల్లో తలపడుతున్న ఉపాధ్యాయులు


త్రో బాల్ పోటీల్లో పాల్గొన్న టీచర్లు

సబ్బవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల క్రీడా పోటీలు స్థానిక ప్రతిభ విద్యాలయంలో శనివారం ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. ఉపాధ్యాయులకు క్రికెట్, ఉపాధ్యాయినులకు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. తొలుత ఎంఈవో-1 లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల్లో ఉత్సాహంతో పాటు మానసిక, శారీరక దృఢత్వం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పోటీలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీనికి ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన కనిపించిందన్నారు. డిసెంబరు 13, 14 తేదీల్లో జరిగే డివిజన్ స్థాయి పోటీలకు క్రికెట్ నుంచి 16 మంది ఉపాధ్యాయులను, త్రోబాల్ క్రీడ నుంచి 16 మంది ఉపాధ్యాయినులను ఎంపిక చేసినట్టు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ‘ నోబెల్ టీచర్స్’ కృషి


ఎన్‌టీఏ సభ్యత్వ నమోదు చేస్తున్న ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం కాగితాలపై ప్రకటించిన కరువుభత్యాన్ని నగదు రూపంలో చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్క శ్రీనుబాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు స్పష్టం చేశారు. పట్టణ, మండల పరిధిలో ఉన్న పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం సంఘం ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ జీతాలు చెల్లించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కాగితాలపై ప్రకటించిన కరువుభత్యాన్ని ఈ ప్రభుత్వం నగదు రూపంలో చెల్లించిందని గుర్తుచేశారు. ఇటీవల ప్రభుత్వం ఒక బకాయి కరువు భత్యాన్ని ప్రకటించి వెంటనే అందజేసిందన్నారు. గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా ఉండేది కాదని, నేడు నేరుగా ముఖ్యమంత్రి వద్దకే వెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం అన్ని సంఘాల ప్రతినిధులు, వర్గాలకు వచ్చిందని వివరించారు. గత కొన్నేళ్లుగా నిలిపివేసిన పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేశారన్నారు. పీఆర్సీ కమిటీ నియమించి ముందస్తు కరువు భత్యాన్ని ప్రకటించేలా కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు కూడా అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని, ఏకపక్షంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన హోదాల్లో ఉన్న అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. అంతకు పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏంఆర్ నూకేష్, రాష్ట్ర ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కృష్ణమోహన్, ఉమామహేశ్వరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



రైతులతో మాట్లాడుతున్న ఆత్మ పీడీ అప్పలస్వామి

తుమ్మపాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆత్మ పీడీ అప్పలస్వామి పేర్కొన్నారు. శనివారం తుమ్మపాల, దిబ్బపాలెం గ్రామాల్లో నిర్వహించిన నానో యూరియా ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నానో యూరియా పిచికారీ చేయడం ద్వారా వరి పొలం ఏపుగా పెరుగుతుందన్నారు. అన్ని పంటలకు నానో యూరియాను వినియోగించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కషాయాలు, ఘనజీవామృతాలు, పచ్చిరొట్ట విత్తనాలు వాడటం వలన భూమి సారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, సిబ్బంది నరసింహ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

‘పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మరిన్ని సేవలు’


కొత్తగా ఏర్పడిన పీఏసీఎస్ సభ్యులతో పీలా గోవింద

అనకాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు మరిన్ని మెరుగైన సేవలందించడమే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్‌ల) లక్ష్యం కావాలని అర్బన్ ఫైనాన్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. అనకాపల్లి క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయనను కొత్తగా ప్రభుత్వం నియమించిన అనకాపల్లి పట్టణ పీఏసీఎస్, సీహెచ్ఎన్ అగ్రహారం పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. పీలాను కలిసిన వారిలో అనకాపల్లి పట్టణ పీఏసీఎస్ చైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు, సీహెచ్ఎన్ అగ్రహారం పీఏసీఎస్ చైర్మన్ బంటు రవి, డైరెక్టర్లు కాండ్రేగుల చిన్నా, ఎల్లపు శ్రీనివాసరావు, గనిరెడ్డి రాజు, జెర్రిపోతుల రమణ, జనసేన నాయకుడు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన గవర కార్పొరేషన్ చైర్మన్


మంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసిన మళ్ల సురేంద్ర

అనకాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడుని శనివారం విశాఖ విమానాశ్రయంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు వేగవంతం అయ్యేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రిని సురేంద్ర అభినందించారు.

అభయాంజనేయ ఆలయంలో విశేష పూజలు


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదా నది తీరాన ఉన్న అభయాంజనేయ ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు సూర్యప్రకాశరావు, నారాయణ శాస్త్రి, శివకేశవులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

యువతకు ఉపాధి అవకాశాలు

కొత్తూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో స్కిల్ ఇండియా సీడ్ ఆఫ్ ద్వారా డీడీయూజీకేవై కార్యక్రమం చేపట్టిందని నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్ సంస్థ సీఈవో పిల్లా రమేశ్ శనివారం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు నైస్ మ్యాన్ పవర్ సొల్యూషన్ ద్వారా వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. అనంతరం వారికి వివిధ ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలన్నీ ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు, యూనిఫాం, ట్రైనింగ్ కిట్లు అందజేయనున్నారన్నారు.

వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కశింకోట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సత్యసాయి ఆశ్రమంలో యాభైమంది వృద్ధులు, వికలాంగులకు శనివారం అన్నదానం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు చేపడుతున్నామని రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి, టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల సతీష్, పీఏసీఎస్ చైర్మన్ సిదిరెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రత్నంప్రకాశ్

సబ్బవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ వ్యాధి నివారణ అందరి బాధ్యతని రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ డాక్టర్ ఎం.రత్నంప్రకాశ్ అన్నారు. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సేవా పథకం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిపై ముందుగా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ అనేది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని వివరించారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచన చేశారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అఫీసర్ డాక్టర్ ఎల్.గణేశ్, అధ్యాపకులు రామకృష్ణ, రజిని, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంచాలి


గుడివాడ పాఠశాలను సందర్శించిన డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలను మరింతగా పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. శనివారం ఆయన గుడివాడ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల బేస్లైన్ పోరల్ పటిమను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలును స్వయంగా రిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మేరీ జాన్, హెచ్ఎం కిల్లో రామ్మూర్తి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

చింతపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విజయవాహిని చారిటబుల్ ట్రస్టు ఎంహెచ్ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ భార్గవి అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలకు విజయవాహిని చారిటబుల్ ట్రస్టు రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత అంశాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా భార్గవి మాట్లాడుతూ నెలసరి సమయంలో ఎదురయ్యే సమస్యలపై వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. అధిక రక్తస్రవం, అక్రమ రుతుక్రమం జరిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం స్థానిక ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి, ఎంపీడీవో సీహెచ్. సీతామహాలక్ష్మి, టాటా ట్రస్టు వ్యవసాయనిపుణుడు డాక్టర్ అప్పలరాజు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నూకరత్నం మృతి టీడీపీకి తీరనిలోటు : గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి చెందిన టీడీపీ నేత బేతా నూకరత్నం మృతి పార్టీకి తీరనిలోటని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నూకరత్నం కుటుంబ సభ్యులను శనివారం ఏఎంసీ చైర్‌పర్సన్ కిల్లో ఊర్మిళతో కలిసి గిడ్డి ఈశ్వరి పరామర్శించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ బేతా నూకరత్నం పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్ పెదిరెడ్ల బేతాళుడు, సేవా ఈశ్వరమ్మ, టీడీపీ నాయకుడు సోమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

▸▸ ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ


స్కూల్ వార్షికోత్సవంలో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రదర్శన (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో శ్రీపూజ.

పాడేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కేవలం విద్యకు మాత్రమే పరిమితం కావద్దని, అన్ని రంగాల్లో రాణించాలని ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీపూజ ఆకాంక్షించారు. స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 45వ వార్షికోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మల్టీ టాలెండ్‌గా ఉండేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. అలాగే యాంత్రికంగా కాకుండా సృజనాత్మకంగా, వినూత్నంగా ఆలోచించేందుకు ప్రయత్నించాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండడం మంచిదన్నారు. ప్రతి అంశంపై ప్రశ్నించాలనే భావన విద్యార్థుల్లో ఉండాలని ఆమె సూచించారు. ఈసందర్భంగా ఎల్‌కేజీ స్థాయి నుంచి టెన్త్ విద్యార్థుల వరకు చేసిన పలు రకాల ప్రదర్శనలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో డీఎస్పీ షహబాజ్ అహ్మద్, టీడబ్ల్యూ డీడీ పీటీకే.పరిమిళ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, సెయింట్ ఆన్స్ కరస్పాండెంట్ ప్రేమ, ప్రిన్సిపాల్ మరియానా, టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'బెర్రి బోరర్' పట్ల కాఫీ రైతులు అప్రమత్తం కావాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న కాఫీశాఖ అధికారి మత్స్యరాజు

డుంబ్రిగుడ, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కాఫీ పంటను నాశనం చేసే బెర్రి బోరర్ పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన అధికారి మత్స్యరాజు సూచించారు. మండలంలోని గరిడేల గ్రామంలో శనివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. బెర్రి బోరర్ వ్యాధి నివారణకు సేకరించిన కాఫీ పండ్లను పల్పింగ్ చేసి, వేడి నీటిలో రెండు నిమిషాలు ముంచాలన్నారు. అనంతరం బయటకు తీసుకెళ్లి పల్పింగ్ చేసి సిమెంట్ కల్లాల్లో ఆరబెట్టి తేమ శాతం 10.5 ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గసబ పంచాయతీ సర్పంచి సునీత, కాఫీ శాఖ లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో-2 గెన్ను

డుంబ్రిగుడ, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి-2 గెన్ను ఆధ్వర్యంలో శనివారం కిల్లోగుడ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఎంఈవో గెన్ను మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పుడూ విధి నిర్వహణలో బిజీగా ఉంటారని, అటువంటి వారికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడాయన్నారు. ఆ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అప్పలరాజు, ఎం. శ్రీను ఎస్‌రాజు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పెద్దపీట : గిడ్డి ఈశ్వరి


చింతపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పాల్గొన్న వ్యవసాయాధికారులు, కూటమి నాయకులు


పాడేరురూరల్: వర్తనాపల్లిలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని చేపడుతున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెంకటరమణ తదితరులు

చింతపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి):ఏజెన్సీలో వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గాడిదలమెట్టలో నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలుపరుస్తున్నారన్నారు. గిరిజన రైతులకు 90శాతం రాయితీపై రాజ్‌మా, అపరాలు, వేరుశనగ విత్తనాలను ఎ ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. విత్తనశుద్ధి మందులు, ఎరువులు రాయితీపై అందజేశారన్నారు. గంజాయికి ప్రత్యామ్నాయంగా వ్యవసాయ, ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్. సీతామహాలక్ష్మి, ఏవో టి. మధుసూదనరావు, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, ఏఎంసీ చైర్మన్ కిల్లో ఊర్మిళ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్లు పెదిరెడ్ల బేతాళుడు, చెన్నకేశవనాయుడు, టీడీపీ నాయకులు బొర్ర విజయరాణి, దేపూరి వెంగళయ్య, నాగేశ్వరరావుపాల్గొన్నారు.

పాడేరురూరల్‌లో..

గిరిజన రైతులు వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్థానిక పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి డప్పోడి వెంకటరమణ కోరారు. శనివారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి మండలంలోని కాడెలి పంచాయతీ వర్తనాపల్లి గ్రామంలో రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సేంద్రీయ పద్ధతిలో పండించుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, హార్టీకల్చర్ అధికారులు, టీడీపీ నాయకులు ఎల్.పార్వతమ్మ, ఎం.కనకరత్నం తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని తుంపాడ పంచాయతీ గెడ్డంపుట్టు గ్రామంలో శనివారం నిర్వహించిన రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రైతును రాజును చేసేందుకు పలు పథకాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ఈఆర్ఏ శ్రీనివాస్, ఏఈవోలు సీహెచ్.పార్వతి, ఎం.సూర్యనారాయణ నాయుడు, సర్పంచులు అడపా సూర్యకాంతం, గబ్బాడ చిట్టిబాబు, మాజీ సర్పంచ్ ముదువా వెంకటేశ్వర్లు, వీఏ జి.రామజ్యోతి, రైతులు పాల్గొన్నారు.

సీలేరులో..

జీకేవీధి మండలం ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో శనివారం వ్యవసాయాధికారులు రైతన్నా.. మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మరితోట, తోకరాయి గ్రామాల్లో మండల వ్యసాయాధికారి గిరిబాబు ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికి పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అలాగే ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరికరాల గురించి గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. నీటి భద్రత, డిమాండ్, ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రొసెసింగ్, ప్రభుత్వం నుంచి లభించే మద్దతు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయకులు జోసెఫ్, పవన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : డీఈవో

పాడేరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో బ్యాటింగ్ చేయగా.. ఎంఈవో మేరీ జాన్ బౌలింగ్ చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ పురుష ఉపాధ్యాయులకు క్రికెట్, మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను ప్రభుత్వం మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తుందన్నారు. ఇటువంటి క్రీడా పోటీలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పి.సూరిబాబు, హెచ్ఎంలు ఎస్.విశ్వప్రసాద్, జీవీవీ.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


పాడేరురూరల్: ఉపాధ్యాయ క్రీడలను ప్రారంభిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

కొయ్యూరులో..

శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈవో రాంబాబు అన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-1 క్రీడా మైదానంలో మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో విజేతలను డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తితో ఆటలు ఆడాలని ఎంఈవో బాబూరావు పడాల్ సూచించారు. మండలంలోని ఉపాధ్యాయుల ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్, తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో -2 రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ప్రవేశానికి ఆంక్షలు తొలగించాలి

▸▸ మండల సమావేశంలో సభ్యుల తీర్మానం

కొయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రవేశానికి ఆంక్షలు తొలగించాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీర్మానం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఇటీవల హత్యకు గురైన జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలపై శాఖల వారీగా అధికారులు వివరించారు. అనంతరం ఎంపీపీ రమేశ్‌బాబు మాట్లాడుతూ సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలను ప్రజాప్రతినిధులు సందర్శించే అవకాశం లేకుండా ఆంక్షలు విధించడం దారుణమన్నారు. ప్రజా ప్రతినిధులకు అవకాశం ఉండేలా ఆంక్షలు సడలించాలని తీర్మానం చేద్దామని కోరడంతో సభ్యులందరూ అంగీకరించారు. పీహెచ్‌సీలో మందుల కొరత లేకుండా చూడాలని సభ్యులు కోరారు. డౌనూరు ఎంపీటీసీ సభ్యుడు బిడజాన అప్పారావు మాట్లాడుతూ గ్రామాలలో సారా, బెల్టుషాపులు అధికమై శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయన్నారు. కొయ్యూరు, మంప ఎస్ఐలు కిషోర్‌వర్మ, శంకరరావు మాట్లాడుతూ సారా తయారీ నివారణకు ఇప్పటికే పలు చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే బెల్ట్‌షాపుల నియంత్రణకు తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం కొండగోకిరి సర్పంచ్ ముసిలినాయుడు మాట్లాడుతూ గోకిరి గ్రామంలో ఒక మహిళ కారణంగా శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని, ఆమెను ఎవరైనా ప్రశ్నిస్తే తప్పుడు కేసులతో ఇబ్బందులు పెడుతున్నదన్నారు. దీనిపై డీటీ కుమారస్వామి స్పందించి సోమవారం గ్రామంలో ఇరు శాఖల ఆధ్వర్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జీవీవీ ప్రసాదరావు, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హౌసింగ్ ఏఈ గోవిందు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు రామకృష్ణ, సాయి, పశు వైద్యాధికారి రాజేశ్, వైస్ ఎంపీపీలు, ఎంఈవో రాంబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్‌బాబు

యువతకు ఆదర్శం సర్దార్ వల్లభాయ్ పటేల్

▸▸ రాజ్యసభ సభ్యుడు వెంకట సత్యనారాయణ


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పాకా వెంకట సత్యనారాయణ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

అరకులోయ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నేటితరం యువత సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని రాజ్యసభ సభ్యుడు పాకా వెంటక సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండల కేంద్రం అరకులోయలో శనివారం కేంద్ర యువజన సర్వీసులు- క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ 565పైగా సంస్థలను వీలినం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పటేల్ సేవలను గుర్తుచేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఐక్యత నడక ర్యాలీనికి శ్రీకారం చుట్టిందన్నారు. మేరా భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు మాట్లాడుతూ పటేల్ జయంతిని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. గుజరాత్ నర్మదా తీరంలోని ఐక్యత చిహ్నాం వద్ద ఉత్సవాలు ముగిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలోని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర, రాజారావు, నాగేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్, మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ చలపతిరావు, కొండబాబు, విజయలక్ష్మీ, నాగబాబు, అనిత్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

'బూదరాళ్ల' సమస్యలు పరిష్కరించండి

కొయ్యూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదరాళ్ల పంచాయతీలో చేరిన నల్లబిల్లి, కొత్తవీధి, చీడిపల్లి, బి. శింగవరం, సూదులపాడు గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వార్డు సభ్యుడు సాగిన సంజీవ్ తెలిపారు. పాడేరు కలెక్టరేట్‌లో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశామన్నారు. పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు నిర్మించాలని, ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. తనతోపాటు టీడీపీ నేత కె. చంద్రరావు, ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు ఉన్నారన్నారు.

సచివాలయ ఏఎన్ఎంల నిరసన

పాడేరురూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సచివాలయ గిరిజనేతర ఏఎన్ఎంలకు ప్రమోషన్‌లు కల్పించవద్దని శనివారం ఏడీఎంహెచ్‌వో ప్రతాప్‌కు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు శెట్టి నాగరాజు, అంబిక, లక్ష్మి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సచివాలయ ఏఎన్ఎంలకు ఇస్తున్న పదోన్నతుల్లో 33 మంది గిరిజన ఏఎన్ఎంలకు మాత్రమే పదోన్నతుల అవకాశం కల్పించారన్నారు. మిగిలిన 56 పోస్టులకు గిరిజనేతర ఏఎన్ఎంలకు పదోన్నతులు కల్పిస్తామని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఇది జీవో నంబరు 68కి వ్యతిరేకమని, అధికారులు పునరాలోచన చేయాలన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప భక్తుల ఇరుముడులు

సీలేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరులో శనివారం తెల్లవారుజాము నుంచి 32 మంది అయ్యప్పస్వామి భక్తుల ఇరుముడులు కట్టారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు దామోదర స్వామి, ఆధ్వర్యంలో ఇరుముడుల కట్టారు. ఇరుముడులు కట్టుకున్న భక్తులు ముందుగా అయ్యప్పస్వామి ఆలయంలో 18 మెట్లు ఎక్కి స్వామి వారిని దర్శించుకున్నారు. వారంతా శబరిమలకు పయనమయ్యారు.

ఏజెన్సీలో బినామీ మైనింగ్ : సీపీఐ

పాడేరురూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మైనింగ్ పేరుతో బినామీ వ్యవస్థ పెరిగిపోతుందని సీపీఐ జిల్లా నాయకులు జల్లి రాజుబాబు మండిపడ్డారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జి.మాడుగుల మండలం కంబాలబైలు వద్ద ఉన్న క్వారీ అనుమతులు గిరిజనుల పేరిట ఉన్నప్పటికీ దాని నుంచి వచ్చే ఆదాయం మాత్రం గిరిజనేతరులు పొందుతున్నారన్నారు. అనుమతి పొందిన గిరిజనుడికి క్వారీపై ఎటువంటి వివరాలు తెలపకుండా క్వారీ నిర్వాహకులైన గిరిజనేతలు మోసం చేస్తున్నారన్నారు. అధికారులు గిరిజనేతరుల కాసులకు కక్కుర్తిపడి 1/70 చట్టానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ క్వారీలను అరికట్టకుంటే ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు.

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

▸▸ జంగిల్‌లోకి దూసుకుపోయిన కారు


ఎక్స్‌కవేటర్‌తో కారును బయటకు తీసుకున్న ప్రయాణికులు

గూడెంకొత్తవీధి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుచ్చరపాలెం మలుపు వద్ద కారు అదుపుతప్పి జంగిల్‌లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు పెను ప్రమాదం తప్పింది. గొలుగొండ మండలం చోద్యం గ్రామానికి చెందిన నలుగురు కారులో శనివారం ఉదయం ధారకొండ అమ్మవారి ఆలయానికి వెళ్లారు. దర్శనం చేసుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. దుచ్చరపాలెం మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రహదారి పక్కనున్న జంగిల్‌లోకి వెళ్లిపోయింది. అయితే జంగిల్ వద్ద రాళ్లుగాని, భారీ చెట్లు, లోయ లేకపోవడంతో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

చిరుధాన్యాలు గిరిజన రైతుల వారసత్వపు పంటలు


మాట్లాడుతున్న జానపదకళ సృజనాత్మక అకాడమీ చైర్మన్ గంగులయ్య

డుంబ్రిగుడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి సాగు ద్వారా లభించే (మిల్లెట్స్)ను గిరిజన రైతులకు వారసత్వ పంటగా భావించాలని రాష్ట్ర జానపద కళల అకాడమిక్ చైర్మన్ వంపూరి గంగులయ్య అన్నారు. కిల్లోగుడలో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్, సంజీవని స్వచ్ఛంద సంస్థ నిర్వహిచిన చిరుధాన్యాల ఫుడ్ క్యాంటీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన ప్రకృతి సిద్ధమైన సామలు, రాగులు, కొర్రలు, వరి వంటి చిరుధాన్యాలను కాపాడుకోవాలన్నారు. ఇలాంటి ప్రకృతి అందిస్తున్న పంటలను ప్రతి ఒక్కరు తింటూ ఆరోగ్యాంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ చిరంజీవి, మండల అధ్యక్షుడు ధనేశ్వరరరావు, మండల ప్రధాన కార్యదర్శి మల్లికర్జునరావు, సంయుక్త కార్యదర్శులు కోటేశ్వరరావు, సహదేవ్, మధు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా కేసులపై అశ్రద్ధ వద్దు

▸▸ జిల్లా మలేరియా అధికారిణి తులసీ

అనంతగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మలేరియా కేసు నమోదైన వెంటనే వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా విభాగం అధికారిణి తులసీ సూచించారు. మండలంలోని భీమవరంలో గల పీహెచ్‌సీని శనివారం ఆమె సందర్శించారు. ముందుగా ల్యాబ్ గదిని తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. మలేరియా కేసు నమోదైన వెంటనే కుటుంబీకులతో పాటుగా చుట్టుపక్కల వారికి రక్త పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గొట్టిపాడు గ్రామానికి వెళ్లి మలేరియాపై అవగాహన కల్పించారు. అక్కడ నుంచి భీంపోల్ ఆశ్రమ బాలికల పాఠశాలకు వెళ్లి విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. జిల్లా అధికారి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ దాలన్న దొర, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ జి.రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 'నోబెల్ టీచర్స్' కృషి


సభ్యత్వ నమోదు చేస్తున్న ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం కాగితాలపై ప్రకటించిన కరువుభత్యాన్ని నగదు రూపంలో చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్క శ్రీనుబాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజు స్పష్టం చేశారు. పట్టణ, మండల పరిధిలో ఉన్న పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను శనివారం సంఘం ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ జీతాలు చెల్లించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కాగితాలపై ప్రకటించిన కరువుభత్యాన్ని ఈ ప్రభుత్వం నగదు రూపంలో చెల్లించిందని గుర్తుచేశారు. ఇటీవల ప్రభుత్వం ఒక బకాయి కరువు భత్యాన్ని ప్రకటించి వెంటనే అందజేసిందన్నారు. గత ప్రభుత్వంలో కనీసం సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా ఉండేది కాదని, నేడు నేరుగా ముఖ్యమంత్రి వద్దకే వెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం అన్ని సంఘాల ప్రతినిధులు, వర్గాలకు వచ్చిందని వివరించారు. గత కొన్నేళ్లుగా నిలిపివేసిన పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేశారన్నారు. పీఆర్‌సీ కమిటీ నియమించి ముందస్తు కరువు భత్యాన్ని ప్రకటించేలా కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు కూడా అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని, ఏకపక్షంగా వ్యవహరించే అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏంఆర్ నూకేష్, రాష్ట్ర ప్రతినిధులు ఉమామహేశ్వరరావు, కృష్ణమోహన్, ఉమామహేశ్వరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు: ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు తెలిపారు. మండలంలోని వడ్డాదిలో శనివారం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఆదివారంలోగా సంబంధిత పత్రాలను సచివాలయాలలో సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిని సమగ్రంగా పరిశీలించి అర్హత కలిగిన వారందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందిస్తామన్నారు. ఉద్యోగులు అదనపు సమయం కేటాయించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, ఏంవీఎస్ లవరాజు, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ సభ్యుడు సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, నాయకులు దొండా గిరిబాబు, సింగంపల్లి రమేశ్ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల భోజనంపై విచారణ


సిబ్బందిని విచారిస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ

గొలుగొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు శుక్రవారం రాత్రి భోజనం 11 గంటలకు భోజనం వడ్డించడంపై ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ శనివారం విచారణ చేపట్టారు. విద్యాలయంలో ప్రస్తుతం 272 మంది ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. వారికి శుక్రవారం రాత్రి 11 గంటల తరువాత సిబ్బంది భోజనం వడ్డించారని సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ విచారణ చేపట్టి, సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్టు గుర్తించారు. అయితే విచారణ సంతృప్తికరంగా లేదని, రెండు రోజుల్లో స్వయంగా జిల్లా అధికారులు కేజీబీవీని సందర్శించి విచారణ చేపడతారని ఎంఈవో తెలిపారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్, నాయకులు ఎగోపి, సుర్ల బాబ్జి కేజీబీవీని సందర్శించారు.

తుఫాన్ హెచ్చరికతో రైతుల్లో అలజడి


మాకవరపాలెంలో పొలంలోనే కోసివున్న వరి చేను

మాకవరపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరితో రైతుల్లో అలజడి మొదలైంది. వారం రోజుల్లో వరిచేను కోసేందుకు సిద్ధపడుతున్న రైతులకు తుఫాన్ గండంగా మారింది. ఇప్పటికే కొన్నిచోట్ల వరిచేను కోశారు. తుఫాన్ హెచ్చరికతో పంటను శనివారం రైతులు కుప్పలు వేశారు. కొందరు కోతలు నిలిపివేశారు. ఇప్పటికే మాకవరపాలెం, తామరం, జంగాలపల్లి, గిడుతూరు, మల్లవరం గ్రామాల్లో వరి చేను కోసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఏదేమైనా తుఫాన్ కారణంగా వరి కోతలు నిలిపివేయాలని ఏవో డి.అప్పారావు రైతులకు సూచించారు.

మాదకద్రవ్యాల మత్తులో పడొద్దు: సీఐ రేవతమ్మ


సదస్సులో మాట్లాడుతున్న సీఐ రేవతమ్మ

నాతవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువకులు మాదక ద్రవ్యాల మత్తులో పడి బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ కోరారు. చమ్మచింత గ్రామంలో శనివారం రాత్రి చట్టాలపై అవగహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడితే 20 ఏళ్ల జైలు శిక్షపీడీ యాక్టు విధించే ప్రమాదం ఉందన్నారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. మహిళా రక్షణ చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వర రావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కాశపు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్ కోఆర్డినేటర్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న కోఆర్డినేటర్

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ కొర్రా శ్రీనివాసరావు ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికయ్యారు. తాడేపల్లిలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషగిరి, ఎండీ జి.గణేశ్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు అభినందించారు.

సబ్ జైలులో న్యాయమూర్తుల తనిఖీలు


సబ్ జైలులో ఆహారం తనిఖీ చేస్తున్న న్యాయమూర్తులు

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలులో సివిల్ జడ్జి పి.షియాజ్‌ఖాన్, అదనపు సివిల్ జడ్జి రోహిత్ శనివారం తనిఖీలు చేశారు. జైలులో వంట శాలను. జైలు ఆవరణను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి ఆరోగ్య పరీక్షలు, భోజనం, వసతులపై ఆరా తీశారు. ఎంత కాలంగా రిమాండ్‌లో ఉంటున్నారని అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే న్యాయ సహాయం చేస్తామని వారు తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణ పనుల పరిశీలన

మాడుగుల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కృష్ణాపురం పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను శనివారం ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ వడ్డాది చారుమతిదేవి, మండల ఇంజనీర్ శ్రీనివాసుతో కలిసి పరిశీలించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.32 లక్షలతో నిర్మిస్తున్న ఈ భవనం పనులు త్వరితగతిన పూర్తిచేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఎంపీడీవో సూచించారు.

అభివృద్ధి పనులు ఎప్పుడు మొదలు పెడతారు?

మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిలదీత
పట్టణంలో కుక్కల బెడదపై ధ్వజం
ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణ ఆపండి: వైస్ చైర్మన్ రామకృష్ణ



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి... మాట్లాడుతున్న జనసేన, వైసీపీ కౌన్సిలర్లు

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వార్డుల్లో అభివృద్ధి పనులు ఎప్పుడు మొదలు పెడతారని అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షత శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలోని చింతపల్లి రోడ్డులో రూ.కోట్లు విలువ చేసే ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణకు గురవుతున్నదని, గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మించిన రక్షణ గోడను ఆక్రమణదారులు తొలగించారని తెలిపారు. ఎంతో విలువైనన స్థలం ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మునిసిపాలిటీలో పార్కింగ్ స్థలాలు లేకుండా విచ్చలవిడిగా అనధికార నిర్మాణాలు చేపడుతున్నారని, ప్రభుత్వ స్థలాలు అక్రమించి నిర్మిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ బీపీఎస్ పథకంలో అనధికార నిర్మాణాలు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చివరి అవకాశం ఇస్తుందన్నారు. తొమ్మిదో వార్డు కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య మాట్లాడుతు వార్డులో సంవత్సరం క్రితం పది అభివృద్ధి పనులు మంజూరు చేశారని, వీటినిఎప్పుడు పనులు మొదలు పెడతారని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు వేసి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కాదని, కూటమి ప్రభుత్వంలో కూడా అదే జరుగుతున్నదని చెప్పారు. కొత్తవీధి శ్మశానవాటిక దగ్గర కల్వర్టు కుంగిపోయి ఏడాది కావస్తున్నా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కొత్తవీధి మీదుగా నిర్మించిన నర్సీపట్నం-పెద్దబొడ్డేపల్లి రోడ్డులో తుప్పలు పెరిగి పోయాయని, వీటిని తొలగించి శుభ్రంగా ఉంచాలని కోరారు. వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మునిసిపాలిటీలో 521 వీధి కుక్కలు పట్టుకోవడానికి అజెండాలో తెలిపారని, వీటిని ఏ ప్రాదిపతికన లెక్కించారని ప్రశ్నించారు. కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ వీధి కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉందన్నారు. వార్డు సచివాలయ సిబ్బందితో వీధి కుక్కలను లెక్కించామన్నారు. పశు సంవర్థక డాక్టరు ఆధ్వర్యంలో సంతానోత్పత్తి జరగకుండా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అనుమానం ఉంటే ఒక కమిటీ వేసి, వారి సమక్షంలో చేయమంటే చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ఆర్‌అండ్‌బీ ఏఈ ఎస్ఎల్ నాయుడు మాట్లాడుతూ తుఫాన్ సమయంలో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేస్తున్నామని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్ డబ్బీరు శ్రీకాంత్ మాట్లాడుతూ డ్రైనేజీలు లేకుండా రోడ్లు వేయడంతో ఉపయోగం ఉండడం లేదన్నారు. దీనివల్ల వర్షం నీరంతా రహదారులపై ఉండిపోతున్నదని చెప్పారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలు శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు



నర్సీపట్నంలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు... బుచ్చెయ్యపేటలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆటల పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంఎల్‌సీ గాదె శ్రీనివాసుల నాయుడు పోటీలను ప్రారంభించారు. పురుషులకు క్రికెట్, మహిళలకు త్రో బాల్ పోటీలు నిర్వహించారు. విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల రూరల్: స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఉపాధ్యాయులకు క్రికెట్, త్రోబాల్ పోటీలను ఎంఈవోలు ఈశ్వరరావు, దేముడమ్మ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలు డివిజన్, జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బండారు ముత్యాలనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: మండలంలోని అప్పలరాజుపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయుల పోటీలను ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పోటీలు హోరాహోరీగా జరిగాయి. మహిళా ఉపాధ్యాయులకు సోమవారం త్రోబాల్ పోటీలను నిర్వహిస్తామని ఎంఈవోలు కె.బొంజుబాబు, బీవీ.రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం సతీశ్, ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఫణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట: మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు జాన్‌ప్రసాద్, జగ్గారావు మాట్లాడుతూ వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న మహిళా ఉపాధ్యాయులు అద్భుత ప్రతిభను చూపారన్నారు. విజేతలుగా నిలిచిన వారిని జోనల్ పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శేషగిరి రావు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలోని సీతయ్యపేటలో ఉన్నత పాఠశాల మైదానంలో ఉపాధ్యాయుల క్రీడా పోటీలు జరిగాయి. ఎంఈవోలు బుద్ద కాశీ, పలివెల గీత పోటీలను ప్రారంభించారు. మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాచపల్లి రెవెన్యూలో భూ దోపిడీ

▸▸ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్, పక్కన నాయకులు

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం మండలంలోని రాచపల్లి రెవెన్యూ పరిధిలో భూ దోపిడీ జరుగుతున్నదని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆరోపించారు. పెదబొడ్డేపల్లిలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాచపల్లి రెవెన్యూ పరిధిలోని 737 సర్వే నంబరులో 489 మంది సాగుదారుల పేర్లు రాశారని, అయితే వారి ఊరు, తండ్రి పేర్లు పేర్కొనలేదని ఆరోపించారు. సమచార హక్కు చట్టం ప్రకారం 469 పేర్లు ఇచ్చారని, ఇప్పుడు జాబితాలో 489 పేర్లు ఉన్నాయని, 20 మంది పేర్లు అదనంగా చేర్చారని ఆయన చెప్పారు. గ్రామసభ నిర్వహించేటప్పుడు ఏ కంపెనీకి భూములు తీసుకుంటున్నారు? ఎంత పరిహారం ఇస్తున్నారనేది ఆర్డీవో వివరంగా చెప్పకుండా తూతూమంత్రంగా ముగించేశారని విమర్శించారు. ఈ భూమిలో 40 సంవత్సరాలు పైగా సాగులో ఉన్న రైతులకు మార్కెట్ విలువ ప్రకారం రూ.18 లక్షలు పరిహారం ఇవాలన్నారు. ఆర్డీవో సహకారంతో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు రెండు కోట్ల విలువ చేసే 13.64 ఎకరాలు, భీమబోయిన పాలెంసర్పంచ్ రుత్తల నందకిశోర్ రూ.కోటి విలువ చేసే 5.31 ఎకరాలను బినామీ పేర్లతో దోపిడి చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే రైతులే బుద్ధి చెబుతారు

మాకవరపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తప్పుడు ఆరోపణలు చేస్తే రైతులే తగిన బుద్ధి చెబుతారని మాకవరపాలెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లురామునాయుడు అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా స్పీకర్ అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో 737 సర్వే నంబరులోని ప్రభుత్వ భూమిని రైతుల ఆమోదంతో ప్రభుత్వానికి ఇస్తే ఎమ్మెల్యేకు ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. 737 సర్వే నంబరులో బినామీలు అంటూ ఊకదంపుడు ప్రసంగం చేయడం సరికాదన్నారు. గ్రామసభ నిర్వహిస్తే వైసీపీ నాయకులే ఆమోదించారని గుర్తు చేశారు. అప్పటిలో తామరం ప్రభుత్వ భూమిని లబ్ధిదారుల వద్ద, మెడికల్ కాలేజీలో రైతుల వద్ద భూములు తీసుకున్న వారి నుంచి గణేశ్ బినామీలు భారీ మొత్తంలో ముడుపులు వసూలు చేశారన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, ఏఎంసీ డైరెక్టర్ రమణ, నాయకులు నందకిశోర్, జమీందార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు

బాలికల వసతిగృహం ఆవరణలో సీసీ కెమెరాలు

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చీడికాడ రోడ్డులోని ఎస్సీ బాలికల వసతిగృహం, పరిసరాల్లో లయన్స్ క్లబ్ సహకారంతో సీఐ బి.అప్పలరాజు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. బాలికల హాస్టల్ లోపల, బయట కూడా కెమెరాలు అమర్చారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులను సీఐ అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నల్లమిల్లి గనిరెడ్డి, ఉగ్గిన నాగబాబు, కార్యదర్శి ఫాల్గుణ, సభ్యులు వేపాడ సత్యనారాయణ, సాయిరాం శ్రీను, ముక్కా రమేశ్, టీడీపీ నేతలు పప్పు శ్రీనివాసరావు, ఎలకా మల్లిబాబు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి'

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్స్‌ను ఆదుకుంటామని చెప్పి రైతులను ముంచేసిన చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గోవాడకు పూర్వ వైభవం తీసుకు వస్తామని చెప్పిన ఎమ్మెల్యేలు, ఉన్న వైభవం లేకుండా చేశారని ఆరోపించారు. రైతులు, కార్మికుల బకాయిలు రూ.32 కోట్లు చెల్లించాలని ఫ్యాక్టరీని తెరిపించి హామీలు నిలబెట్టుకోవాలని కోరారు.

ఇళ్ల స్థలాల దరఖాస్తు గడువు పొడిగించాలి

బుచ్చెయ్యపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాలకు దరఖాస్తు గడువు పొడిగించాలని టీడీపీ వడ్డాది అధ్యక్షుడు దొండా నరేశ్ కోరారు. సాంకేతిక లోపంతో పాటు పాటు ఆదివారం సచివాలయ ఉద్యోగుల సెలవు కారణంగా ధరఖాస్తులు సమర్పించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పెద్దలు స్పందించి గడువును పొడిగించాలని కోరారు.

గంజాయి రవాణా మార్గాలపై నిఘా

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న కొట్నాబిల్లి, కవ్వగుంట గ్రామాల కాలిబాల మార్గాలపై పోలీసులు నిఘా పెట్టారు. గంజాయి రవాణా అరికట్టడానికి కొత్తకోట సీఐ కోటేశ్వరావు, రావికమతం ఎస్ఐ రఘువర్మ శనివారం డ్రోన్ కెమెరాను ఎగుర వేశారు. గంజాయి రవాణాకు ఉపయోగించే కాలిబాట మార్గాలపై ప్రత్యేక నిఘా పెట్టామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

రోలుగుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వినోద్‌బాబు సూచించారు. స్థానిక జూనియర్ కళాశాలను శనివారం తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో మాట్లాడుతూ విద్యార్థులు శతశాతం కళాశాలకు హాజరయ్యే చూడాలని, ఫలితాలను మెరుపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

కృష్ణాదేవిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాత కృష్ణాదేవిపేటలో నిరుపేదలకు శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నేత సహదేముడు మాట్లాడుతూ నిరుపేదలకు చేయూతనందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలంతా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సహదేముడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వి.నాగేశ్వరరావు, నాయకులు ప్రసాద్, చిన్ని, శివ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి చోడవరం సమస్యలు

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు



డిప్యూటీ సీఎం పవన్‌కు స్వాగతం పలుకుతున్న రాజు... సూర్యచంద్ర

చోడవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి చోడవరం సమస్యలను తీసుకు వెళ్లినట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. శనివారం విశాఖ నేవీ ఫ్లీట్‌కు హాజరైన సందర్భంగా పవన్ కలిసి సమస్యలు విన్నవించామన్నారు. రహదారులు, గోవాడ షుగర్స్ సమస్యపైనా డిప్యూటీ సీఎంకు నివేదించామని చెప్పారు.

పవన్‌ను కలిసిన నర్సీపట్నం ఇన్‌చార్జి

నర్సీపట్నం అర్బన్: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర శనివారం విశాఖ ఎయిర్ పోర్టులో కలిశారు. వచ్చే నెల 4న నేవీ డే సందర్భంగా నిర్వహించే వేడుకుల కోసం పవన్ కల్యాణ్ శనివారం విశాఖకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర, జనసేన నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా అభినందనలు తెలిపారు.

కొత్తకోటలో రక్షిత నీరు సరఫరా

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట పంచాయతీ పరిధిలోని అరుంధతి, అంబేడ్కర్ కాలనీలలో శనివారం రక్షిత నీటిని సరఫరా చేశారు. ఈ కాలనీల్లో తాగునీటి సమస్యపై శుక్రవారం మహిళలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మండల ప్రత్యేక అధికారిణి సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, ఎంపీడీవో మహేశ్ స్పందించారు. గ్రామంలో మంచినీటి పథకం మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా కాలనీ వాసులకు సక్రమంగా తాగునీరు అందలేదని ప్రత్యేకాధికారి చెప్పారు. పెద్ద ట్యాంకు మరమ్మతు పనులు పూర్తయ్యేంత వరకు మంచినీరు అందని, ప్రాంతానికి వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలని ఈఈవో జ్యోతిశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. కాలనీలలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భగవంతులరావు, ఈవో జ్యోతిశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచాలలో ప్రత్యేక వైద్య శిబిరం

చీడికాడ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మంచాల పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు 52 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. సీతాకాలం ముగిసేవరకూ కాచి ఒడబోసిన నీటినే తాగాలని సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ సూచించారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పి మొల్లి వరలక్ష్మి, ఏఎన్‌ఎం కొండమ్మ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

దేవరాపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కేవీ.రమణ చెప్పారు. ముషిడిపల్లి ఎస్సీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం చట్టాలపై అవగాహన కలిగించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్‌తో సమస్యలపై మాట్లాడి పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

పైపుల పక్కదారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

రావికమతం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నంపేట గ్రామంలో తాగునీటిని సరఫరా చేసే పైపులను పంచాయతీ కార్యదర్శి సహకారంతో తవ్వించి వేరే ప్రాంతాలకు తరలించారని మండల ఉపాధ్యక్షుడు దంట్ల వెంకటరమణ, పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థులు శనివారం జిల్లా కలక్టర్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పాత లైన్ ఉండగానే సక్రమంగా పనిచేయలేదన్న నెపంతో, మళ్లీ కొత్తగా గ్రామంలో తాగునీరు సరఫరా కోసం నాబార్డు నిధులు రూ.25 లక్షలతో పైపులైన్ కొనుగోలు చేశారని చెప్పారు. ఈ నిధులతో అప్పటిలో ఇంటింటా కుళాయిల ద్వారా తాగునీరు అందించేందుకుగాను గ్రామంతా ప్లాస్టిక్ పైపులైన్ నిర్మించారన్నారు. పైపులైన్ పునరుద్ధరణ పేరుతో ప్రస్తుతం ఉన్న ప్లాస్టిక్ పుపులైన్‌ను తొలగించి అమ్మకానికి తరలించారని వారు ఆరోపించారు. ఇందుకోసం పంచాయతీ, జిల్లా కలక్టర్ అనుమతులు పొందాల్సి ఉన్నప్పటికీ, ఈ నిబంధనలు పాటించకుండా పైపులను ట్రాక్టర్లలో తరలించుకుపోయారని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.

ఈవీఎం గోదాముల భద్రతపై ఆరా

» తనిఖీ చేసిన కలెక్టర్



పాడేరులో ఈవీఎం గోదాము సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న ఈవీఎంల గోదాములను కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంలున్న గోదాములకు కల్పిస్తున్న భద్రతా చర్యలపై ఆరా తీశారు. అలాగే ఆ ప్రాంతాల్లోని పరిస్థితులను, తలుపులకు వేసిన సీళ్లను ఆయన పరిశీలించారు. ఎప్పటిలాగానే భద్రతా చర్యలు కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌వో అంబేడ్కర్, ఆర్డీవో ఎంవీఎస్.లోకేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

» డీటీవో సుభాషిణి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పింఛన్‌దారులు తమ జీవన ప్రమాణ ధ్రువపత్రాలను (లైఫ్ సర్టిఫికెట్లు) 2026 జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీలోగా తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి (డీటీవో) సుభాషిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నవంబరులో సమర్పించిన ధ్రువపత్రాలు ఈ సంవత్సరానికి పరిగణించబడవని, అందువల్ల పింఛన్‌దారులు 2026వ సంవత్సరానికి సంబంధించి తాజా ధ్రువపత్రాలను నిర్దిష్ట గడువులోగా సమర్పించాలని తెలిపారు. జీవన ప్రమాణ ధ్రువపత్రాలను జిల్లా ఖజానా కార్యాలయం, ఉప ఖజానా కార్యాలయాలు, మీ-సేవా కేంద్రాలు, పోస్టాఫీసులు, బ్యాంకులతోపాటు ఆన్‌లైన్‌లో 'జీవన ప్రమాణ్' యాప్ ద్వారా కూడా సమర్పించవచ్చునని ఆమె స్పష్టం చేశారు. ధ్రువీకరణ ప్రక్రియలో ఆధార్ కార్డు, పింఛన్ ఐడీ లేదా పీపీవో సంఖ్య, ఓటీపీ కోసం మొబైల్ నంబర్, బ్యాంకు పాసుబుక్ దగ్గర వుంచుకోవాలని సూచించారు.

గిరిజన ప్రాంతంలో అరుదైన వృక్ష సంపద

» ఏయూ వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ సంధ్య దీపిక



కాఫీ మొక్కలపై విద్యార్థులకు క్షేత్రస్థాయి బోధన చేస్తున్న డాక్టర్ సంధ్య దీపిక

చింతపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అరుదైన వృక్ష సంపద ఉందని ఏయూ వృక్షశాస్త్ర విభాగం అధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ డి.సంధ్య దీపిక అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ప్రొఫెసర్లు బొటానికల్ టూర్‌లో భాగంగా స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, ఉద్యాన పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఔషధ మొక్కలు, కాఫీ, మిరియాలు, దాల్చిన చెక్క, వలిసెలు, వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్య దీపిక మాట్లాడుతూ గిరిజన ప్రాంతం విభిన్న వాతావరణం కలిగి ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో అరుదైన పంటలు పండుతాయన్నారు. చాలా విలువైన ఔషధ మొక్కలు ఉన్నాయని చెప్పారు. మొక్కలపై అధ్యయనం చేసేందుకు గిరిజన ప్రాంతం అత్యంత అనువైందన్నారు. గిరిజన ప్రాంతంలో పర్యటించడం వలన పాఠ్యాంశాల్లో నేర్చుకున్న అంశాలను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి ఆచరణాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. విద్యార్థులు మొక్కలపై పరిశోధనలు చేసేందుకు ముందుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర ప్రొఫెసర్లు డాక్టర్ బి.సుజాత, డాక్టర్ ఎస్‌బీ పడాల్, డాక్టర్ జె.ప్రకాశ్, డాక్టర్ నీలిమ, డాక్టర్ కె.సత్యవతి, ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ పి.జోగారావు, ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు, విద్యార్థులు పాల్గొన్నారు.

నత్తలతో పంటలు నాశనం

» కొండపాలెం, కేపీ అగ్రహారం, ఐతంపూడి, పి.భీమవరం గ్రామాల్లో వీటి బెడద అధికం

» తీవ్రంగా నష్టపోతున్న రైతులు

» నివారణకు చర్యలు తీసుకోవాలని వేడుకోలు



పగటి వేళ అరటి చెట్టులో దాక్కున్న నత్తలు



పంటలను నాశనం చేస్తున్న నత్తలను చంపేందుకు సేకరించిన దృశ్యం

బుచ్చెయ్యపేట నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాలెం, కేపీ అగ్రహారం, ఐతంపూడి, పి.భీమవరం గ్రామాల్లో కోతులు, అడవి పందులతో పాటు నత్తల బెడద ఎక్కువైంది. నత్తలు ఆకుల రసం పీల్చి పంటలకు నాశనం చేస్తున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కేపీ అగ్రహారం పరిధిలో మాజీ డిప్యూటీ కలెక్టర్ 25 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ జీడి పప్పు, పప్పు ధాన్యాలు, పండ్ల తోటలు, కొబ్బరి చెట్లు వేయగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కేపీ అగ్రహారం, కొండపాలెంలో నత్తల బెడద అధికంగా ఉందని, కేపీ అగ్రహారంలో సుమారు 100 ఎకరాల వరి చేను, దీంతో పాటు పప్పు ధాన్యాలు, పండ్ల మొక్కలు నాశనమ య్యాయని సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. అలాగే కొండపాలెంలో షేక్ బాబ్జీ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అన్ని రకాల పంటలు సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. జీడితోటలో అంతర పంటగా బంతిపూల సాగు చేస్తున్న ఆయనకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రాత్రిపూట నత్తలు పూర్తిగా పంటలను నాశనం చేస్తున్నాయని కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల భవాని తెలిపారు. అంతే కాకుండా ఇళ్లల్లో పెంచుకొనే పూల మొక్కలు, బొప్పాయి, కొబ్బరి, పండ్ల రకాల మొక్కలను నత్తలు నాశనం చేస్తున్నాయని చెప్పారు. చివరకు సరుగుడు తోలు కూడా నాశనమవుతున్నాయన్నారు. రైతులు కుటుంబ సమేతంగా వెళ్లి నత్తలను సేకరించి చంపుతున్నా ఫలితం లేకుండా పోతుందని, వీటి బెడద రోజు రోజుకూ పెరుగుతుందన్నారు. వీటి నివారణకు చర్యలు తీసుకోకపోతే మండల వ్యాప్తంగా ఇవి వ్యాప్తి చెందుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గ్రూపు-1 ఆఫీసర్‌గా ఎక్సైజ్ ఎస్‌ఐ



గ్రూపు-1 అధికారిగా ఎంపికైన అభిషేక్‌ను సన్మానిస్తున్న ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది

నర్సీపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న ఎం.అభిషేక్ ఒడిశా రాష్ట్రం గ్రూప్- 1 అధికారిగా ఎంపికయ్యారు. శనివారం ఆయన రిలీవ్ అవుతున్న సందర్భంగా ఎక్సైజ్ స్టేషన్‌లో సీఐ సునీల్‌కుమార్, కార్యాలయ సిబ్బందితో కలిసి అభిషేక్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

» సెమీఫైనల్స్‌కు చేరిన విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, చిత్తూరు బాలికల జట్లు

» నేడు ముగింపు పోటీలు



పోటీ పడుతున్న గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు

లంకెలపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు రెండో రోజైన శనివారం ఉత్కంఠగా సాగాయి. అండర్-14 విభాగంలో ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో శనివారం సాయంత్రం వరకు బాలికల విభాగంలో 10 లీగ్ మ్యాచ్‌లు, బాలుర విభాగంలో 8 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. రాత్రి 9.30 గంటల ప్రాంతంలో లీగ్ దశ పోటీలు ముగిశాయి.

నేడు తుది పోటీలు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో భాగంగా శనివారం రాత్రి బాలికల విభాగంలో నిర్వహించిన క్వార్టర్ ఫైనల్స్‌లో విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల జట్లు ఉత్తమ ప్రతిభ చూపి సెమీఫైనల్స్ చేరుకున్నాయి. కాగా బాలుర విభాగంలో శనివారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం, కర్నూలు, తూర్పుగోదావరి, చిత్తూరు, కడప జిల్లాల జట్లు సత్తాచాటి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి.

ఆదివారం సాయంత్రం బాలికల సెమీ ఫైనల్స్ ఫైనల్స్, బాలుర విభాగంలో క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ ఫైనల్స్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, పీడీలు అన్నాజీరావు, రాణి, లక్ష్మి ఖోఖో పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాన్ని పెంపొందించాలి

» ఉపాధ్యాయులకు డీఈవో ఆదేశం



విద్యార్థి పఠనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

పెదబయలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కనీస పఠనా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశించారు. మండలంలోని సీతగుంట మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ సర్వే ప్రతి పాఠశాలలో పక్కాగా అమలు చేయాలని సూచించారు. అనంతరం సెయింటాన్స్ పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు అందుతున్న బోధనపై ఆరా తీశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబరు 6 నుంచి ప్రతి పాఠశాలలో 100 రోజుల యాక్షన్ ప్లాన్ విధిగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఏటీడబ్ల్యూవో జగత్ రాయ్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ బాలరాజు, హెచ్‌ఎం మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు ఉమామహేశ్ పాల్గొన్నారు.

డీజిల్ మాఫియా

... 5వ పేజీ తరువాయి

కంపెనీలకు చెందిన పెట్రోల్ బంకులు 200 వరకు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు 40 లక్షల నుంచి 50 లక్షల లీటర్ల డీజిల్ అమ్మకం జరుగుతుంది. డీజిల్ విక్రయాలపై వ్యాట్ రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి 22.25 శాతం ఆదాయం దక్కుతుంది. లీటర్ డీజిల్ బేసిక్ ధర రూ.72.15 కాగా 22.25 శాతం వ్యాట్ కింద రూ.16 రాష్ట్ర ప్రభుత్వానికి వెళుతుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో రోజుకు 40 లక్షల లీటర్ల డీజిల్ విక్రయాలు జరుగుతాయనుకుంటే..రూ.6.4 కోట్లు ప్రభుత్వానికి సమకూరుతుంది. ఇదికాకుండా అడిషనల్ వ్యాట్, రోడ్ సెస్ కింద లీటర్‌కు మరో రూ.5 ఆదాయం లభిస్తుంది.

ఇదిలావుంటే పరిశ్రమల అవసరాల కోసం డీజిల్ మాదిరిగా ఉండే 10 పీపీఎం మినరల్ హైడ్రోకార్బన్ ఆయిల్ (ఎంహెచ్‌ఓ), డిస్టిలేట్ ఆయిల్, డీఓఎం స్పెషలిస్ట్ ఆయిల్, పారాఫిన్ ఆయిల్ వంటి వాటిని యూఏఈ నుంచి గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు దిగుమతి చేసుకుంటున్నారు. అది జీఎస్టీ పరిధిలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నువాటా సమానంగా దక్కుతుంది. ఈ ఆయిల్ లీటర్ బేసిక్ ధర రూ.63 కాగా 18 శాతం జీఎస్టీ కింద కేంద్ర ప్రభుత్వానికి రూ.5.67 చొప్పున మాత్రమే ఆదాయం లభిస్తుంది. డీజిల్ ద్వారా రాష్ట్రానికి వచ్చే పన్ను ఆదాయంతో పోల్చితే ఇది చాలా తక్కువ. గతంలో విశాఖ పోర్టుకు కూడా దిగుమతి అయిన ఈ తరహా ఆయిల్‌ను అక్కడకు వచ్చే భారీ కంటెయినర్లు, లారీలు, ట్రాలర్లకు విక్రయిస్తుండడంతో డీఆర్ఐ అధికారులు దాడి చేసి కేసులు నమోదు చేశారు. దీంతో దిగుమతి నిలిచింది. ప్రస్తుతం తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్ నుంచి రవాణా అవుతోంది. పరిశ్రమల అవసరాలకు వాడే ఆయిల్ రవాణాపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడంతో అధికారికంగానే జీఎస్టీ బిల్లు తీసుకుని ట్యాంకర్లతో తెలంగాణ, ఏపీ, ఒడిశా వస్తున్నారు. మార్గమధ్యంలో తమ వాహనాల నిలుపుదల కోసమంటూ ఒక గోడౌన్ ఏర్పాటుకు అనుమతి తీసుకుని అక్కడ బ్లెండింగ్ యూనిట్‌లు పెడుతున్నారు. అక్కడ పరిశ్రమలకు వాడే ఆయిల్‌కు కొన్ని రసాయనాలు కలిపి డీజిల్ మాదిరిగా రంగు, డెన్సిటీ వచ్చేలా ప్రాసెస్ చేసి ముందుగా అవగాహన కుదుర్చుకున్న ట్రాన్స్‌పోర్టు యజమానులు, లారీల యజమానులకు విక్రయిస్తున్నారు. డీజిల్ ధర కంటే రూ.పది వరకు తగ్గించి ఇస్తుండడంతో ఎక్కువ వాహనాలు ఉన్నవారు బంకుల్లో కాకుండా అనధికార వ్యాపారుల నుంచే కొనుగోలుచేస్తున్నారు. ఈ విధంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రతిరోజూ రెండు లక్షల లీటర్లు వరకూ విక్రయిస్తున్నట్టు పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. అడ్డరోడ్డు, గాజువాక, పెందుర్తి, మల్కాపురం వంటి ప్రాంతాల్లో బ్లెండింగ్ యూనిట్‌లు ఉన్నట్టు సమాచారం. అక్రమ డీజిల్ విక్రయాలపై గతంలో గాజువాకలో విజిలెన్స్ అధికారులు దాడి చేసి కేసులు నమోదుచేశారు. ఇప్పటికీ ఈ తరహా విక్రయాలు గుట్టుగానే జరుగుతున్నా సివిల్ సప్లయ్స్ అధికారులు పట్టించుకోవడం లేదు. పరిశ్రమల ఆయిల్ సివిల్ సప్లై యాక్ట్ కిందకు రాదంటూ చర్యలకు వెనుకాడుతున్నారు. అక్రమ డీజిల్ విక్రయాల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి లీటరుకు రూ.15.40 ఆదాయానికి గండిపడుతోంది. రెండు లక్షల లీటర్లకు లెక్కేసుకుంటే రోజుకు రూ.31 లక్షల వరకు ఆదాయం కోల్పోతోంది. దీనిపై దృష్టిసారించాలని కోరుతూ జిల్లా పెట్రోల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లతోపాటు నగర పోలీస్ కమిషనర్‌ను కూడా కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో అధికారులు ఈ తరహా మాఫియాపై నిఘా పెట్టినట్టు సమాచారం.

అన్నదాతల్లో తుఫాన్ బెంగ

... 5వ పేజీ తరువాయి

వచ్చిన పొలాల్లో వరి కోతలను రెండు, మూడు రోజులపాటు వాయిదా వేసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో ఈదురు గాలులు వీచి, గింజ రాలిపోయే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు. అయితే తుఫాన్ ప్రభావం అనకాపల్లి జిల్లాపై ఎంతవరకు వుంటుందనే ఆదివారం సాయంత్రానికి స్పష్టత వస్తుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.



రావికమతం మండలం మత్స్యపురంలో పనలపై వున్న వరి పంట

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో పలాస వాసి మృతి



షేక్ తాజుద్దీన్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు హైవే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ సన్నిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన షేక్ తాజుద్దీన్ (36) ఇటీవల రాజమహేంద్రవరంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం రాత్రి అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై పలాసకు బయలుదేరాడు. దారిలో వేంపాడు వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్నది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పలాసలో వున్న మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

అచ్యుతాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురువాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సీఐ చంద్రశేఖర్ వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి అచ్యుతాపురం-ఎలమంచిలి ప్రధాన రహదారిలో వెదురువాడ ఆర్‌కే టవర్స్ వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తికి సంబంధించి అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. పంచనామా అనంతరం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సమీపంలో వున్న సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు.

పర్యాటక ప్రాంతాల సందర్శనకు

ఇంటిగ్రేటెడ్ కార్డు

» వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో నిర్ణయం

» కైలాసగిరిపై నిర్మించే త్రిశూల్, ఢమరుకం ప్రాజెక్టుకు అదనపు నిధులు

విశాఖపట్నం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)కు చెందిన పర్యాటక ప్రాంతాల సందర్శనకు ఒక ఇంటిగ్రేటెడ్ కార్డు తీసుకురావాలని నిర్ణయించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం బోర్డు సమావేశం జరిగింది. చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, విజయవాడ నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్‌లు వర్చువల్‌గా పాల్గొన్నారు. అజెండా అంశాలను కమిషనర్ తేజ్ భరత్ ఒక్కొక్కటి వివరించగా దానిపై ముఖ్య కార్యదర్శి పలు సూచనలు చేశారు. కైలాసగిరిపై నిర్మించే త్రిశూల్, ఢమరుకం ప్రాజెక్టుకు అవసరమైన అదనపు నిధుల మంజూరుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాలకు అవసరమైన సిబ్బందిని గ్రామ, వార్డు సచివాలయాల నుంచి సమకూర్చుకోవడానికి కూడా అనుమతించారు. ఇంకా పలు అంశాలపై చర్చించారు.

పేదరిక నిర్మూలనకు ప్రత్యేక కృషి

» కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

» పీ4 అమలుకు మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపు



దినేశ్‌కుమార్, కలెక్టర్

పాడేరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర లక్ష్యంగా చేపడుతున్న పీ4 ద్వారా పేదరిక నిర్మూలనకు అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని వివిధ శాఖల అధికారులతో శనివారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానంగా బంగారు(పేద) కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ఎక్కువ మంది మార్గదర్శులు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో పేదరిక నిర్మూలనకు, పీ4ను పక్కాగా అమలు చేసేందుకు మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, తదితరులు కృషి చేయాలన్నారు. అలాగే పీ4 అమల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని అధికారులను ఆయన హెచ్చరించారు. జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ విజేత ఉమ్మడి విశాఖ జిల్లా

పాలకోడేరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షం హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 27 నుంచి జరుగుతున్న అంతర్ జిల్లాల అండర్-14 నెట్‌బాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల జట్లు, బాలుర విభాగంలో విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు బహుమతులు అందించారు.

ఆపదమిత్ర వలంటీర్లకు కలెక్టర్ అభినందనలు



ఆపదమిత్ర వలంటీర్లను అభినందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువ ఆపదమిత్ర పథకంలో భాగంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో నిర్వహించిన 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' కార్యక్రమంలో పాల్గొని శిక్షణను పూర్తిచేసుకున్న జిల్లాకు చెందిన పది మంది వలంటీర్లను కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం అభినందించారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న సహాయక చర్యలు, రక్షణ కార్యకలాపాలు, అత్యవసర సన్నద్ధత వంటి అంశాల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	108.00
లైవ్ ధర	128.00
విత్ స్కిన్	226.00
స్కిన్ లెస్	236.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619